# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 1 సంచిక : 315 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) పచురణ : తాడేపల్లిగూడెం శనివారం 19 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 315 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM SAT 19 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## పోర్టు ఆధారిత అభివృద్ధిపై
# చంద్రబాబు ప్రత్యేక దృష్టి..
## ఒకేసారి 28 ప్రాజెక్టులు.. 20,000 ఉద్యోగాలు

- రూ.22,177 కోట్ల విలువైన 28 పారిశ్రామిక ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ ఆమోదం
- ఈ ప్రాజెక్టుల ద్వారా సుమారు 19,739 మందికి కొత్తగా ఉపాధి అవకాశాలు
- ఏపీని హార్డ్‌వేర్, పోర్టు ఆధారిత పారిశ్రామిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యం
- ఎగుమతుల ర్యాంకింగ్‌లో దేశంలోనే 10వ స్థానంలో నిలిచిన తిరుపతి జిల్లా
- ఆమోదం పొందిన ప్రాజెక్టులను 6 నెలల్లో ప్రారంభించాలని సీఎం ఆదేశం



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టించే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన 21వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశంలో రూ. 22,177.84 కోట్ల విలువైన 28 పారిశ్రామిక ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో కొత్తగా 19,739 మందికి ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. ఇంధన, ఐటీ, ఆహార శుద్ధి, తయారీ, పర్యాటక రంగాలకు చెందిన ఈ ప్రతిపాదనలతో రాష్ట్ర సమగ్రాభివృద్ధికి బాటలు వేస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

**హార్డ్‌వేర్, పోర్టు ఆధారిత అభివృద్ధిపై ఫోకస్**

ఈ సమావేశంలో సీఎం చంద్రబాబు రెండు ప్రధాన లక్ష్యాలపై అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. రాష్ట్రాన్ని దేశంలోనే కీలకమైన హార్డ్‌వేర్ తయారీ కేంద్రంగా (హబ్) తీర్చిదిద్దడంతో పాటు, తీర ప్రాంతాన్ని సద్వినియోగం చేసుకుంటూ పోర్టు ఆధారిత పారిశ్రామిక వ్యవస్థను (ఎకో సిస్టమ్) నిర్మించాలని ఆదేశించారు. సెమీ కండక్టర్లు, చిప్ తయారీ, రోబోటిక్స్ వంటి ఆధునిక రంగాల్లో భారీ పెట్టుబడులను ఆకర్షించాలని సూచించారు. కొప్పర్తి, తిరుపతి, లేపాక్షి ఎలక్ట్రానిక్స్ హబ్‌లలో పరిశోధన, డిజైన్, తయారీతో కూడిన పూర్తిస్థాయి ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఎలక్ట్రానిక్స్, హార్డ్‌వేర్ రంగాల్లో పెట్టుబడుల కోసం తైవాన్‌తో సంప్రదింపులు జరుపుతున్నట్లు మంత్రి నారా లోకేశ్ తెలిపారు.

**నైపుణ్యాభివృద్ధి, ఎగుమతులే లక్ష్యం**

రాష్ట్రంలోని యువతకు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. 10వ తరగతి నుంచే నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని, ఇందుకు స్కిల్ మ్యాపింగ్ నిర్వహించాలని సీఎం ఆదేశించారు. శ్రీసిటీ వంటి పారిశ్రామిక కేంద్రాల వల్ల తిరుపతి జిల్లా ఎగుమతుల ర్యాంకింగ్‌లో దేశంలోనే 10వ స్థానంలో, తూర్పుగోదావరి 12వ స్థానంలో నిలిచాయని, వీటిని టాప్-5కి తీసుకురావడమే లక్ష్యమని చంద్రబాబు పేర్కొన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు

- మిగతా 2లో



## ప్రతిభా కేంద్రాలుగా ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లు..
## ఏఐ స్కిల్స్ తప్పనిసరి
### నారా లోకేశ్ ఆదేశాలు

- నిమ్మకూరులో ఐఐటీ-జేఈఈ/నీట్ అకాడమీ ఏర్పాటుకు ఆమోదం
- 10 రెసిడెన్షియల్ స్కూళ్లను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లుగా అభివృద్ధి చేయాలని నిర్ణయం
- విద్యార్థులకు ఏఐ స్కిల్స్‌తో పాటు కంప్యూటర్ ల్యాబ్స్ తప్పనిసరి
- సిబ్బంది పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం

- మిగతా 2లో

### అంబటి రాంబాబుకు ఈడీ నోటీసులు...
## విచారణకు రావాలంటూ ఫోన్ ద్వారా సమాచారం..



పెన్ పవర్ డెస్క్:మాజీ మంత్రి అంబటి రాంబాబుకు మరో షాక్ తగిలింది. విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేసింది ఈడీ. సెప్టెంబర్ 11వ తేదీనే నోటీసుకు పంపినట్లు

- మిగతా 2లో

## చంద్రబాబు చేతుల మీదుగా..
## నేడు విశాఖలో చారిత్రక ఘట్టం



- విశాఖలో 40 ఏళ్ల సమస్యకు కూటమి ప్రభుత్వం పరిష్కారం
- నేడు 28,445 కుటుంబాలకు ఇంటి పట్టాలు పంపిణీ చేయనున్న సీఎం చంద్రబాబు
- రూ.8,874 కోట్ల విలువైన 399 ఎకరాల భూమి క్రమబద్ధీకరణ
- ఇంటిపై పూర్తి హక్కు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్న ముఖ్యమంత్రి
- విశాఖ అభివృద్ధిలో పేదలను భాగస్వాములను చేస్తామని వెల్లడి

- మిగతా 2లో



## వైసీపీ హయాంలో ఏపీపీఎస్సీని స్కామ్‌గా మార్చారు
### 'జెన్ జీ' ఇంటరాక్షన్‌లో బుద్దా వెంకన్న

- విజయవాడలోని గాంధీజీ మహిళా కళాశాలలో జెన్ జీ ఇంటరాక్షన్
- వైసీపీ హయాంలో ఉద్యోగాల భర్తీలో అవకతవకలు జరిగాయన్న బుద్దా వెంకన్న
- వీటన్నింటిపై విచారణ జరిపి బాధ్యులను శిక్షిస్తామని వెల్లడి

- మిగతా 2లో



## రాయలసీమ పౌరుషం ఏమిటో చూపిస్తాం

- సీమ ప్రాంత అభివృద్ధికి ప్రతిరూపంగా కొత్త పార్టీ రాబోతోందన్న విజయసాయిరెడ్డి
- టీడీపీ, వైసీపీ రెండూ కుటుంబ రాజకీయాలకే ప్రాధాన్యతనిచ్చాయని విమర్శ
- యువత భాగస్వామ్యంతో సీమను తిరిగి రతనాలసీమగా మారుస్తానని హామీ

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కొత్త శకం ప్రారంభం కాబోతోందని, రాయలసీమ ప్రాంత అభివృద్ధి, స్థానిక ప్రజల ఆత్మగౌరవానికి ప్రతిరూపంగా

- మిగతా 2లో

## కేసీఆర్, హరీశ్ రావు భూములపై పూర్తి ఆధారాలు ఉన్నాయి



- కేసీఆర్ ఓవర్ లాప్ ల్యాండ్‌లో ఉన్నారన్న పొంగులేటి
- 2004లో ఒక ఎకరా మాత్రమే చూపించిన కేసీఆర్‌కు వందల కోట్ల భూములు ఎలా వచ్చాయని ప్రశ్న
- తమ గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్ నేతలకు లేదని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఓవర్ లాప్ ల్యాండ్‌లో ఉన్నారని, సర్వే అనంతరం వ్యత్యాసాలు బయటపడితే ఆయనకు నోటీసులు ఇస్తామని తెలంగాణ రెవెన్యూ మంత్రి

- మిగతా 2లో

### నౌకను ఢీకొట్టి మాపైనే నిందలా?..
## పాక్ తీరుపై మండిపడ్డ భారత్



పెన్ పవర్ డెస్క్:అరేబియా సముద్రం అంతర్జాతీయ జలాల్లో భారత్-పాక్ యుద్ధ నౌకలు ఢీకొన్న ఘటనలో పాకిస్థాన్ చేస్తున్న ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది. పాకిస్థాన్ ప్రత్యేక ఆర్థిక మండలిలో భారత నౌక రెచ్చగొట్టే, ఆమోదయోగ్యం కాని చర్యలకు పాల్పడిందని ఆ దేశ విదేశాంగశాఖ చేసిన ఆరోపణలు అసంబద్ధమైనవని స్పష్టం చేసింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. దాయాది దేశం తీరుపై మండిపడ్డారు. "నౌకను ఢీకొట్టిన వ్యవహారంపై పాక్ రాయబారికి సమన్లు

- మిగతా 2లో



### దుగరాజపట్నంలో భారీ షిప్‌యార్డ్..
## రూ.15 వేల కోట్ల పెట్టుబడి!

- దుగరాజపట్నంలో గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్
- ఎండీఎల్‌తో ఏపీ ప్రభుత్వ ఎంవోయూ
- ఐదేళ్లలో రూ.15 వేల కోట్ల పెట్టుబడి
- 45 వేల మందికి ఉపాధి అవకాశాలు
- ఏటా 12 లక్షల గ్రాస్ టన్నుల సామర్థ్యం

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో షిప్‌బిల్డింగ్ రంగానికి భారీ ఊతం లభించనుంది. దుగరాజపట్నంలో గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్ ఏర్పాటు చేసేందుకు 'మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్' (ఎండీఎల్)తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో సచివాలయంలో ఎండీఎల్, 'నేషనల్ షిప్‌బిల్డింగ్ అండ్ హెవీ ఇండస్ట్రీస్ పార్క్-ఏపీ' (ఎన్ఎస్‌హెచ్ఐపీ-ఏపీ) మధ్య ఎంవోయూ జరిగింది. వచ్చే ఐదేళ్లలో ఈ ప్రాజెక్టుపై ఎండీఎల్ సుమారు రూ. 15 వేల కోట్లు పెట్టుబడి పెట్టనుంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 45 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. షిప్‌బిల్డింగ్‌తో పాటు మెరైన్ ఇంజినీరింగ్, లాజిస్టిక్స్, సర్వీసులు, అనుబంధ పరిశ్రమలు కూడా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ప్రతిపాదిత షిప్‌యార్డ్ ఏటా 12 లక్షల గ్రాస్ టన్నుల నౌకల నిర్మాణ సామర్థ్యంతో ఏర్పాటు కానుంది. ట్యాంకర్లు,

- మిగతా 2లో



## పాకిస్థాన్‌లో మసీదుపై ఆత్మాహుతి దాడి.. 15 మంది మృతి

- పాకిస్థాన్‌లోని కోహట్‌లో మసీదుపై ఉగ్ర దాడి
- ఈ ఘటనలో ఐదుగురు పోలీసులతో సహా 15 మంది మృతి
- 50 మందికి పైగా తీవ్ర గాయాలు, పలువురి పరిస్థితి విషమం
- పోలీసు కార్యాలయమే లక్ష్యంగా దాడి జరిగినట్లు అనుమానం
- ఇప్పటివరకు ఏ ఉగ్రవాద సంస్థ బాధ్యత ప్రకటించలేదు

- మిగతా 2లో

## ఏఐని పూర్తిగా అదుపులో ఉంచే సాంకేతిక విజ్ఞానం ఇంకా రాలేదు

- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మానవ నియంత్రణలోనే ఉండాలి
- ఏఐ నియంత్రణకు అమెరికా, చైనా మధ్య ఒప్పందం కీలకం
- దేశాలు, కంపెనీలు తమ డేటాపై నియంత్రణ కలిగి ఉండాలి
- భారత్ ఏఐ మిషన్ అందరికీ అందుబాటులో ఉండాలన్న వినయ్ క్వాత్రా
- సియాటెల్‌లో భారత సంతతి టెక్ నిపుణులతో కీలక సమావేశం

- మిగతా 2లో





## నందిగ్రామ్‌లో అనూహ్య మలుపు..
### కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించిన మమత!

- నందిగ్రామ్ బరి నుంచి తప్పుకున్న మమత వర్గం అభ్యర్థి
- కాంగ్రెస్ అభ్యర్థికి పూర్తి మద్దతు ప్రకటించిన దీదీ
- ఇండియా కూటమి ఐక్యత కోసమే ఈ నిర్ణయమన్న మమత
- బీజేపీ ఒక జుమ్లా పార్టీ అని తీవ్ర విమర్శలు

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# నందిగ్రామ్‌లో అనూహ్య మలుపు.. కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించిన మమత!

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. నందిగ్రామ్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు తెలుపుతున్నట్లు మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రకటించారు. తమ పార్టీ అభ్యర్థి నామినేషన్‌ను ఉపసంహరించుకున్న నేపథ్యంలో, బీజేపీకి వ్యతిరేకంగా 'ఇండియా' కూటమి ఐక్యతను చాటేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె స్పష్టం చేశారు.

ఉప ఎన్నికకు ఇంకా నెల రోజుల సమయం ఉండగానే, మమత నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అభ్యర్థి సంచితా ప్రధాన్ అనూహ్యంగా తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. ఈ పరిణామంతో తాము మరో అభ్యర్థిని బరిలోకి దించబోమని, కాంగ్రెస్ అభ్యర్థి మిలన్ ప్రధాన్‌కు పూర్తిస్థాయిలో మద్దతిస్తామని మమతా బెనర్జీ వెల్లడించారు. ఈ సందర్భంగా మమత బెనర్జీ మాట్లాడుతూ, "మేము పోరాటానికి సిద్ధంగా ఉన్నాము. దేశం నుంచి బీజేపీని తరిమికొట్టడమే మా లక్ష్యం. ఇండియా కూటమికి మా పూర్తి సంఘీభావం ఉంటుంది" అని పేర్కొన్నారు. అంతకుముందు రోజు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తనకు ఫోన్ చేశారని, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ సైతం మద్దతు తెలుపుతూ సందేశం పంపారని ఆమె వివరించారు. ఇదే క్రమంలో బీజేపీని ఒక 'జుమ్లా పార్టీ'గా ఆమె అభివర్ణించారు. రాష్ట్ర సచివాలయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి సువేందు అధికారిని కలిసిన తర్వాత సంచితా ప్రధాన్ తన నామినేషన్‌ను ఉపసంహరించుకోవడం గమనార్హం. కాగా టీఎంసీలోని రెండు వర్గాలకు ఎన్నికల సంఘం కొత్త గుర్తులను కేటాయించింది. మమత వర్గానికి 'ఫుట్‌బాల్ ప్లేయర్', ప్రత్యర్థి వర్గానికి 'ఎన్వలప్' గుర్తులను కేటాయించిన సంగతి తెలిసిందే.

## వైసీపీ హయాంలో ఏపీపీఎస్సీని స్కామ్‌గా మార్చారు

విజయవాడలోని గాంధీజీ మహిళా కళాశాలలో నిర్వహించిన 'జెన్ జీ – ఇంటరాక్షన్' కార్యక్రమంలో టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు బుద్దా వెంకన్న పాల్గొని విద్యార్థినులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మెగా డీఎస్సీ, ఏపీపీఎస్సీ నోటిఫికేషన్లపై విద్యార్థినులు అడిగిన పలు ప్రశ్నలకు, సందేహాలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని, గ్రూప్స్ నియామకాలతో సహా ఉద్యోగాల భర్తీని ఒక స్కామ్‌లా మార్చేసి బ్యాక్ డోర్ పద్ధతిలో తమ అనుచరులకు ఉద్యోగాలు ఇచ్చుకున్నారని మండిపడ్డారు. ఈ అక్రమాల వల్ల లక్షలాది మంది ప్రతిభావంతులైన నిరుద్యోగులు నష్టపోయారని, కూటమి ప్రభుత్వం వీటన్నింటిపై పూర్తిస్థాయి విచారణ జరిపించి బాధ్యులను కఠినంగా శిక్షిస్తుందని వెల్లడించారు. గత ప్రభుత్వ లోపాలను సరిదిద్దుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఏపీపీఎస్సీ వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నారని, భవిష్యత్తులో ప్రశ్నాపత్రాల లీకేజీలకు తావులేకుండా అత్యంత పారదర్శకమైన, ఆధునిక భద్రతా ప్రమాణాలతో కూడిన వ్యవస్థను రూపుదిద్దుతున్నారని బుద్దా వెంకన్న తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకం చేసిన మెగా డీఎస్సీ నియామక ప్రక్రియను ఎటువంటి న్యాయపరమైన చిక్కులు లేకుండా, అభ్యర్థులకు సరిపడా సమయం కల్పిస్తూ సమర్థవంతంగా ముందుకు తీసుకెళుతున్నామని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ రంగంలో లక్షలాది ఉపాధి అవకాశాలను సృష్టించేందుకు అంతర్జాతీయ సంస్థలను రాష్ట్రానికి రప్పించేందుకు లోకేశ్ కృషి చేస్తున్నారని కొనియాడారు.

## ఏఐని పూర్తిగా అదుపులో ఉంచే సాంకేతిక విజ్ఞానం ఇంకా రాలేదు

వేగంగా విస్తరిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీ ఎల్లప్పుడూ మానవ నియంత్రణలోనే ఉండాలని, దీని కోసం ప్రభుత్వాలు, టెక్నాలజీ కంపెనీల మధ్య అంతర్జాతీయ స్థాయిలో బలమైన నిబంధనలు అవసరమని మైక్రోసాఫ్ట్ ఛైర్మన్, సీఈఓ సత్య నాదెళ్ల అన్నారు. ఈ ప్రక్రియలో అమెరికా, చైనా దేశాల మధ్య అవగాహన అనేది అత్యంత కీలకమైన తొలి అడుగని ఆయన స్పష్టం చేశారు. సెప్టెంబర్ 17న సియాటెల్‌లో జరిగిన 'ఐడియాస్ ఫర్ ఇండియా' ఫోరమ్‌లో ఆయన ప్రసంగించారు. ఏఐ రంగంలో శక్తివంతమైన ఆవిష్కరణలు వస్తున్నప్పటికీ, దాని నియంత్రణకు సంబంధించిన కీలక ప్రశ్నలకు సమాధానాలు ఇంకా లభించలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "ఏఐని పూర్తిగా అదుపులో ఉంచే సాంకేతిక విజ్ఞానం (సైన్స్ ఆఫ్ అలైన్‌మెంట్) మన వద్ద ఇంకా సిద్ధంగా లేదు. కానీ అత్యంత శక్తివంతమైన టెక్నాలజీ మాత్రం మన చేతిలో ఉంది. ఇది ఒక వాస్తవం" అని ఆయన వివరించారు. మానవాళికి సేవ చేయని, మనిషి నియంత్రణలో లేని ఏ టెక్నాలజీ అయినా నిష్ప్రయోజనమని సత్య నాదెళ్ల తేల్చిచెప్పారు. ఏఐ అభివృద్ధిలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొంటూనే, దాని వల్ల కలిగే ప్రయోజనాలను ప్రపంచానికి అందించాలని సూచించారు. అయితే, ఊహించని పరిణామాలను నివారించేందుకు నిరంతర ప్రయత్నాలు జరగాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ప్రభుత్వాల పాత్ర గురించి మాట్లాడుతూ, ఏఐ పాలనలో తొలి అడుగు అమెరికా–చైనా మధ్య ఏకాభిప్రాయంతో కూడిన నిబంధనల రూపకల్పనే అని పునరుద్ఘాటించారు. అయితే ఈ చర్చల్లో ప్రపంచంలోని ఇతర దేశాలను కూడా భాగస్వాములను చేయాలని ఆయన అన్నారు. ఏఐని అభివృద్ధి చేస్తున్న కంపెనీలు, దేశాలు కలిసికట్టుగా ఉమ్మడి నిబంధనలు రూపొందించుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశాలతో పాటు కంపెనీలకు కూడా తమ పరిజ్ఞానం, డేటాపై పూర్తి నియంత్రణ ఉండటం చాలా ముఖ్యమని నాదెళ్ల పేర్కొన్నారు. "దేశాలు తమ పరిజ్ఞానాన్ని తమ నియంత్రణలో ఉంచుకోవాలి" అని ఆయన అన్నారు. ఇలాంటి భద్రత, భరోసా ఉన్నప్పుడే దేశాలు, కంపెనీలు ఏఐ రంగంలో పూర్తిస్థాయిలో పాల్గొంటాయని, వేరొకరి సాంకేతిక ఆధిపత్యానికి లోబడకుండా ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అమెరికాలో భారత రాయబారి వినయ్ క్వాత్రా మాట్లాడుతూ, డేటా వినియోగం, మోడల్ ట్రైనింగ్ వంటి అంశాలపై ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. భారత్ ఏఐ మిషన్ అందరికీ అందుబాటులో ఉండేలా, పారదర్శకంగా, సురక్షితంగా, నమ్మకంతో కూడుకున్నదై ఉండాలని పునరుద్ఘాటించారు. భారత కాన్సులేట్ జనరల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 40 మందికి పైగా భారత సంతతికి చెందిన సీఈఓలు, టెక్నాలజీ అధికారులు పాల్గొన్నారు. ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్, సెమీకండక్టర్లు వంటి పలు కీలక రంగాలపై చర్చించారు.

## అంబటి రాంబాబుకు ఈడీ నోటీసులు... విచారణకు రావాలంటూ ఫోన్ ద్వారా సమాచారం..

- మొదటి పేజి తరువాయి

ఆయనకు ఈడీ అధికారులు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే.. తనకు ఏ నోటీసులు అందలేదని ఈడీ అధికారులకు తెలిపారు అంబటి. విచారణకు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయనకు అధికారులకు స్పష్టం చేసినట్లు సమాచారం. పలు కేసుల్లో గతంలో అరెస్టైన అంబటికి ఈడీ నేరుగా నోటీసులు జారీ చేయడంపై చర్చనీయాంశంగా మారింది. అంబటి రాంబాబు సుమారు పలు కేసులకు సంబంధించి సుమారు 18 రోజుల పాటు రిమాండ్ లో ఉన్నారు. సీఎం చంద్రబాబుపై చేసిన అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఫిర్యాదుల ఆధారంగా పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆర్థిక లావాదేవీలకు సంబంధించి ఈడీ నోటీసులు జారీ చేయడం హాట్ టాపిక్ గా మారింది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా పోలీసులను కేంద్ర దర్యాప్తు సంస్థలను వాడుకుంటూ తమ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారంటూ మండిపడుతున్నారు వైసీపీ శ్రేణులు.

# చంద్రబాబు చేతుల మీదుగా.. నేడు విశాఖలో చారిత్రక ఘట్టం

విశాఖపట్నంలో దశాబ్దాలుగా నెలకొన్న ఒక జటిల సమస్యకు పరిష్కారం లభించింది. ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని, వాటిపై యాజమాన్య హక్కుల కోసం 40 ఏళ్లుగా ఎదురుచూస్తున్న వేలాది పేద, మధ్య తరగతి కుటుంబాల కల రేపు సాకారం కానుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం విశాఖపట్నం వేదికగా ఈ చారిత్రక కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. మొత్తం 28,445 కుటుంబాలకు రూ.8,874 కోట్ల విలువైన భూమిపై సంపూర్ణ హక్కులు కల్పిస్తూ పట్టాలను అందజేయనున్నారు.

**దశాబ్దాల సమస్యకు ఫుల్‌స్టాప్**

విశాఖ నగర పరిధిలోని అనేక ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాల్లో పేదలు ఇళ్లు నిర్మించుకుని దశాబ్దాలుగా నివసిస్తున్నారు. అయితే, ఆ ఇంటి స్థలంపై వారికి పూర్తి హక్కులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆస్తిని అమ్ముకోలేని, బదలాయించలేని పరిస్థితితో పాటు, భవిష్యత్తుపై భరోసా కరవైంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కూటమి ప్రభుత్వం నడుం బిగించింది. మొత్తం 399 ఎకరాల విస్తీర్ణంలోని 19,33,853 చదరపు గజాల భూమిని క్రమబద్ధీకరించి, ఆయా కుటుంబాలకు పూర్తి హక్కులు కల్పించేందుకు రంగం సిద్ధం చేసింది. విశాఖలో ఇంత భారీ స్థాయిలో భూముల క్రమబద్ధీకరణ చేపట్టి పట్టాలు పంపిణీ చేయడం ఇదే తొలిసారి.

**పేద కుటుంబాల కలను నిజం చేస్తున్నా: సీఎం చంద్రబాబు**

ఈ కార్యక్రమంపై ముఖ్యమంత్రి చంద్రబాబు 'ఎక్స్' వేదికగా స్పందించారు. "తమకంటూ పూర్తి హక్కులతో సొంతిల్లు ఉండాలనేది ప్రతి ఒక్క కుటుంబ కల. అలాంటి వేల మంది కలను నిజం చేసేందుకే విశాఖ వస్తున్నా" అని ఆయన పోస్ట్ చేశారు. ఇది కేవలం పట్టాల పంపిణీ కాదని, 28 వేల కుటుంబాలకు వారి నివాసాలపై పూర్తి హక్కు కల్పించే చరిత్రాత్మక సందర్భమని పేర్కొన్నారు. ఈ పట్టాతో ప్రతి కుటుంబానికి విలువైన ఆస్తి, భవిష్యత్తుకు భద్రత, పిల్లలకు వారసత్వ సంపదతో పాటు ఆత్మగౌరవం, భరోసా లభిస్తాయని సీఎం వివరించారు. దశాబ్దాలుగా ఎదురుచూసిన కుటుంబాల ఆనందం చూడటమే ప్రభుత్వానికి నిజమైన సంతృప్తి అని ఆయన అన్నారు. 2014–19 మధ్య కాలంలో నాటి ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారానికి ప్రయత్నించి కొన్ని జీవోలను జారీ చేసినా, ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో అది పూర్తిస్థాయిలో ముందుకు సాగలేదు. మళ్ళీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లా సమీక్షల్లో ప్రజాప్రతినిధులు ఈ సమస్యను సీఎం దృష్టికి తీసుకురావడంతో, అభ్యంతరాలు లేని ప్రభుత్వ స్థలాల్లోని ఇళ్లను క్రమబద్ధీకరించాలని ఆయన అధికారులను ఆదేశించారు.

**మండలాల వారీగా లబ్ధిదారులు**

ఈ క్రమబద్ధీకరణ ద్వారా గాజువాక నుంచి భీమిలి వరకు అనేక ప్రాంతాల కుటుంబాలు లబ్ధి పొందనున్నాయి. అత్యధికంగా విశాఖ రూరల్‌లో 9,261 కుటుంబాలు, గాజువాకలో 4,353, ములగాడలో 4,213, గోపాలపట్నంలో 3,253, పెందుర్తిలో 2,722, పెదగంట్యాడలో 1,910, మహారాణిపేటలో 1,235, సీతమ్మధారలో 668, భీమిలిలో 464, ఆనందపురంలో 349, పద్మనాభంలో 17 కుటుంబాలు ఈ ప్రయోజనం పొందనున్నాయి.

**సీఎం పర్యటన వివరాలు**

ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం ఉదయం 10.30 గంటలకు విశాఖకు చేరుకుంటారు. ముందుగా ఆర్‌కే బీచ్‌లో 'స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులు, మత్స్యకారులతో ముచ్చటిస్తారు. అనంతరం ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరిగే బహిరంగ సభలో పాల్గొని, లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తారు. కార్యక్రమం ముగిసిన తర్వాత తిరిగి అమరావతికి ప్రయాణమవుతారు.

## ప్రతిభా కేంద్రాలుగా ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లు..

# ఏఐ స్కిల్స్ తప్పనిసరి

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలను (ఏపీఆర్ఎస్) ప్రతిభావంతులను తయారుచేసే అత్యుత్తమ కేంద్రాలుగా తీర్చిదిద్దాలని, మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా అంతర్జాతీయ ప్రమాణాలను నెలకొల్పాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో శుక్రవారం ఆయన అధ్యక్షతన ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ (ఙ్రా=జు×ా) 59వ గవర్నింగ్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రెసిడెన్షియల్ విద్యావ్యవస్థను సమూలంగా బలోపేతం చేసే దిశగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, "ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లు అకడమిక్ ఎక్సలెన్స్‌పై దృష్టి సారించి, ప్రతిభావంతులను తయారు చేసే కేంద్రాలుగా మారాలి" అని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను తొలిసారిగా పత్రికా ప్రకటనల ద్వారా అభినందించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇప్పటివరకు రెసిడెన్షియల్ స్కూళ్లలో చదివిన వారిలో 27 మంది ఐఏఎస్‌లు, 20 మంది ఐపీఎస్‌లు, 13 మంది ఐఆర్ఎస్‌లు, నలుగురు ఐఎఫ్ఎస్‌లతో పాటు ఎందరో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని అధికారులు వివరించగా, మంత్రి లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు.

**కీలక నిర్ణయాలు ఇవే..**

టెక్నాలజీలో వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో నైపుణ్య శిక్షణను తప్పనిసరి చేయాలని, అన్ని స్కూళ్లలో అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 10 ఏపీఆర్ విద్యాసంస్థలను 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'లుగా అభివృద్ధి చేసే ప్రతిపాదనకు బోర్డు ఆమోదం తెలిపింది. ఇప్పటికే తాడికొండ, కొడిగినహళ్లి పాఠశాలలు ఈ జాబితాలో ఉన్నాయి. కృష్ణా జిల్లా నిమ్మకూరులోని ఏపీఆర్ జూనియర్ కళాశాలలో వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఐఐటీ–జేఈఈ/నీట్ అకాడమీని ఏర్పాటు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మరో 6 రెసిడెన్షియల్ స్కూళ్లను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు కూడా సమావేశం ఆమోదముద్ర వేసింది.

సిబ్బంది సంక్షేమం, మౌలిక వసతులపై దృష్టి

సిబ్బంది సంక్షేమానికి సంబంధించి కూడా పలు ముఖ్య నిర్ణయాలు తీసుకున్నారు. ఏపీ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సిబ్బంది పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచే ప్రతిపాదనకు బోర్డు ఆమోదం తెలిపింది. గెస్ట్ ఫ్యాకల్టీ గౌరవ వేతనాలను ఇతర సొసైటీలతో సమానంగా పెంచడంతో పాటు, పీఈటీలను పీడీలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు అంగీకరించింది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయ, బోధనేతర సిబ్బంది నియామకాలకు స్టాఫింగ్ ప్యాట్రన్‌కు ఆమోదం తెలిపారు. అన్ని రెసిడెన్షియల్ స్కూళ్లలో శాశ్వత భవనాలు, మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని, ఆటోమేటెడ్ స్మార్ట్ కిచెన్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. విద్యార్థుల వైద్య అత్యవసర పరిస్థితుల కోసం లక్ష రూపాయల వరకు ఖర్చు చేసే అధికారాన్ని సొసైటీ సెక్రటరీకి కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. జగ్గంపేట నియోజకవర్గంలోని భూపతిపాలెం రెసిడెన్షియల్ స్కూల్‌ను ప్రపంచస్థాయి క్రీడా హబ్‌గా తీర్చిదిద్దే అవకాశాలను పరిశీలించాలని లోకేశ్ ఆదేశించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జే. శ్యామలరావు, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్ రంజిత్ బాషా, ఉన్నత విద్యాశాఖ డైరెక్టర్ నారాయణ భరత్ గుప్తా, ఏపీఆర్ఈఐఎస్ కార్యదర్శి కృష్ణమోహన్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పోర్టు ఆధారిత అభివృద్ధిపై చంద్రబాబు ప్రత్యేక దృష్టి..

- మొదటి పేజి తరువాయి

'వన్ ఫ్యామిలీ––వన్ ఎంట్రప్రెన్యూర్' విధానాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. వీటితో పాటు రేర్ ఎర్త్ మినరల్స్, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకోవాలని చెప్పారు. ఆమోదం పొందిన ప్రాజెక్టులను కేవలం ఆరు నెలల వ్యవధిలో ప్రారంభించేలా పర్యవేక్షించాలని అధికారులకు గడువు విధించారు. ఈ సమావేశంలో మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్, పి. నారాయణ, ఇతర మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**ఎస్ఐపీబీ ఆమోదం పొందిన 28 ప్రాజెక్టుల పూర్తి వివరాలు:**

1. క్లీన్ రెన్యూవబుల్ ఎనర్జీ హైబ్రిడ్ సిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ – కడప జిల్లా – రూ.950 కోట్ల పెట్టుబడి – 90 ఉద్యోగాలు.
2. సాయి బయోఎనర్జీ ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ లిమిటెడ్ – నంద్యాల జిల్లా – రూ.168.56 కోట్లు – 600 ఉద్యోగాలు.
3. ఎం. వెంకటరావు ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (వీఎ= టెర్రావాంట్ జీఎ) – శ్రీ సత్యసాయి జిల్లా – రూ.3,078 కోట్లు – 1,300 ఉద్యోగాలు.
4. రిజాల్వెన్ టూ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ – కర్నూలు – రూ.980 కోట్లు –– 250 ఉద్యోగాలు.
5. ముత్తూట్ ఫిన్‌కార్ప్ లిమిటెడ్ – విశాఖపట్నం – రూ.100 కోట్లు – 2,400 ఉద్యోగాలు.
6. డెలాయిట్ –– విశాఖపట్నం – రూ.43.75 కోట్లు – 2,500 ఉద్యోగాలు.
7. ఫోటాన్‌కోర్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ – అమరావతి –– రూ.9 కోట్లు – 45 ఉద్యోగాలు.
8. వెరిడాటా హెల్త్ ఇంక్. –అమరావతి – రూ.4.5 కోట్లు –– 50 ఉద్యోగాలు.
9. క్వాన్‌ఫ్లుయెన్స్ ప్రైవేట్ లిమిటెడ్ – అమరావతి – రూ.5 కోట్లు – 30 ఉద్యోగాలు.
10. ట్రైక్వాంటా ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ––అమరావతి –– రూ.35 కోట్లు – 175 ఉద్యోగాలు.
11. క్వాంటమ్ కోడాన్ ప్రైవేట్ లిమిటెడ్ – అమరావతి – రూ.167 కోట్లు – 126 ఉద్యోగాలు.
12. శ్రిష్టి క్వాంటమ్ ప్రైవేట్ లిమిటెడ్ – అమరావతి – రూ.100 కోట్లు –– 110 ఉద్యోగాలు.
13. ఆరోహాక్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ – అమరావతి –– రూ.62 కోట్లు – 300 ఉద్యోగాలు.
14. గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్ – మచిలీపట్నం –– రూ.8,000 కోట్లు –– 8,000 ఉద్యోగాలు (3,000 ప్రత్యక్ష, 5,000 పరోక్ష).
15. మై హోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ – పల్నాడు – రూ.3,000 కోట్లు –– 2,000 ఉద్యోగాలు.
16. క్యాటర్‌పిల్లర్ ఇంక్. – శ్రీసిటీ, తిరుపతి – రూ.150 కోట్లు –– 80 ఉద్యోగాలు.
17. ఎంఏఎఫ్ క్లాతింగ్ ప్రైవేట్ లిమిటెడ్ –కుప్పం, చిత్తూరు – – రూ.215 కోట్లు – 2,560 ఉద్యోగాలు.
18. దాల్మియా సిమెంట్ – కడప – రూ.395.23 కోట్లు.
19. అగర్వాల్ ఫౌండ్రీస్ – నెల్లూరు – రూ.549 కోట్లు – 245 ఉద్యోగాలు.
20. శ్రీ వైభవ లక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ – నెల్లూరు – రూ.222.63 కోట్లు –– 300 ఉద్యోగాలు.
21. శ్రీ వసుధ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ – అనంతపురం – రూ.254.06 కోట్లు –– 350 ఉద్యోగాలు.
22. రావోక్స్ అగ్రిటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ – చిత్తూరు – రూ.1,388.14 కోట్లు – 1,000 ఉద్యోగాలు.
23. కెల్లాగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ –– శ్రీ సిటీ, సత్యవేడు – రూ.211.70 కోట్లు – 30 ఉద్యోగాలు.
24. ఎపిటోమ్ ఇండస్ట్రీస్ ఇండియా లిమిటెడ్ – నెల్లూరు – రూ.530.65 కోట్లు –– 238 ఉద్యోగాలు.
25. హిందుస్థాన్ కోకా–కోలా బెవరేజెస్ ప్రైవేట్ లిమిటెడ్ –– విజయనగరం, తిరుపతి – రూ.1,127 కోట్లు –– 195 ఉద్యోగాలు.
26. గ్రాండ్ తిరుపతి హోటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ –– తిరుపతి – రూ.188.11 కోట్లు – 851 ఉద్యోగాలు.
27. సదరన్ గ్లోబ్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ లిమిటెడ్ – అమరావతి – రూ.167 కోట్లు – 600 ఉద్యోగాలు.
28. జేఎల్ అసోసియేట్స్ –– కడప – రూ.53.25 కోట్లు – 314 ఉద్యోగాలు.

## దుగరాజపట్నంలో భారీ షిప్‌యార్డ్.. రూ.15 వేల కోట్ల పెట్టుబడి!

- మొదటి పేజి తరువాయి

బల్క్ క్యారియర్లు, కంటైనర్ నౌకలు, ఎల్ఎన్‌జీ క్యారియర్లు, భారీ ప్రత్యేక నౌకలను ఇక్కడ నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు. అవసరాన్ని బట్టి భవిష్యత్‌లో సామర్థ్యాన్ని మరింత పెంచుకునే అవకాశం ఉంటుంది. దుగరాజపట్నంలో షిప్‌బిల్డింగ్–కమ్–పోర్ట్ క్లస్టర్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. టెక్నో–ఎకనామిక్ ఫీజిబిలిటీ రిపోర్ట్ ప్రకారం షిప్‌బిల్డింగ్, షిప్ రిపేర్ యార్డ్‌కు సుమారు రూ.29,254 కోట్లు, పోర్టు అభివృద్ధికి రూ.9,513 కోట్ల వ్యయం అవుతుందని అంచనా.

## పాకిస్థాన్‌లో మసీదుపై ఆత్మాహుతి దాడి.. 15 మంది మృతి

పాకిస్థాన్‌లో ఉగ్రవాదులు మరోసారి రక్తపాతం సృష్టించారు. వాయవ్య పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్, కోహట్ నగరంలో శుక్రవారం ఓ మసీదును లక్ష్యంగా చేసుకుని ఆత్మాహుతి దాడికి పాల్పడ్డారు. ఈ ఘోర ఘటనలో ఐదుగురు పోలీసు అధికారులతో సహా కనీసం 15 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 56 మంది తీవ్రంగా గాయపడ్డారు. పోలీసు కార్యాలయాల సముదాయానికి సమీపంలో ఉన్న మసీదులోకి ఓ ఉగ్రవాది పేలుడు పదార్థాలతో కూడిన వాహనంతో దూసుకెళ్లాడు. ఈ భారీ పేలుడు ధాటికి మసీదు కుప్పకూలగా, సమీపంలోని పోలీసు భవనం ప్రహరీ గోడ సైతం నేలమట్టమైంది. అనంతరం, తుపాకులతో సాయుధులైన మరో ఇద్దరు ఉగ్రవాదులు పోలీసు ప్రాంగణంలోకి చొరబడేందుకు ప్రయత్నించారు. అయితే, అప్రమత్తమైన భద్రతా సిబ్బంది వెంటనే ఎదురుకాల్పులు జరపడంతో ఓ ఉగ్రవాది హతమయ్యాడు. గాయపడిన వారిలో అధికశాతం ప్రార్థనల కోసం వచ్చినవారేనని, వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు వెల్లడించారు. ఈ కిరాతక దాడిని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తీవ్రంగా ఖండించారు. మృతుల కుటుంబాలకు ఆయన తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆ దేశ అధ్యక్షుడు ఆకాంక్షించారు.

పొరుగునే ఉన్న హంగూ జిల్లాలో గురువారం జరిగిన బాంబు దాడిలో ఆరుగురు సైనికులు మరణించిన మరుసటి రోజే ఈ దారుణం జరగడం కలకలం రేపుతోంది. ఇటీవల కాలంలో పాకిస్థానీ తాలిబన్లు (టీటీపీ) భద్రతా దళాలు, పౌరులను లక్ష్యంగా చేసుకుని దాడులను ముమ్మరం చేశారు. కాగా, తాజా దాడికి సంబంధించి ఇప్పటివరకు ఏ ఉగ్రవాద సంస్థా బాధ్యత ప్రకటించలేదు.

## కేసీఆర్, హరీశ్ రావు భూములపై పూర్తి ఆధారాలు ఉన్నాయి

- మొదటి పేజి తరువాయి

పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. 2004 ఎన్నికల అఫిడవిట్‌లో కేవలం ఒక ఎకరం భూమి మాత్రమే ఉందని చూపించిన కేసీఆర్‌కు వందల కోట్ల విలువైన భూములు ఎక్కడి నుంచి వచ్చాయని నిలదీశారు. తమ భూముల కోసం వచ్చిన దళితులను నిలబెట్టి పసుపు నీళ్లు చల్లించిన చరిత్ర కేసీఆర్ కుటుంబానిదని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి హరీశ్ రావుపై కూడా పొంగులేటి కీలక వ్యాఖ్యలు చేశారు. వట్టినాగులపల్లి భూమిపై హరీశ్ రావు మాటలు మార్చుతున్నారని, ట్రస్ట్ పేరిట భూములను దారి మళ్లించారని ఆరోపించారు. ఇరిగేషన్ మంత్రిగా ఉన్న సమయంలో రంగనాయక్ సాగర్ ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్న 13 ఎకరాల భూమిని డిలీట్ చేయించి, అతి తక్కువ ధరకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. అంతేకాకుండా రూ. 5.40 కోట్ల ప్రభుత్వ నిధులతో ఆ ల్యాండ్‌కు ప్రయోజనం చేకూరేలా రోడ్డు వేయించుకున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తమ వ్యాపార కుటుంబాలపై మాట్లాడే అర్హత బీఆర్ఎస్ నేతలకు లేదన్న మంత్రి, ఈ భూ అక్రమాలకు సహకరించిన అధికారులు ఎంతటివారైనా సరే వారిపై కఠిన చర్యలు ఉంటాయని, సిద్దిపేటలో ఆక్రమణకు గురైన భూముల్లో 'ఇందిరమ్మ టవర్స్' నిర్మిస్తామని స్పష్టం చేశారు.

### నౌకను ఢీకొట్టి మాపైనే నిందలా?..

## పాక్ తీరుపై మండిపడ్డ భారత్

- మొదటి పేజి తరువాయి

జారీ చేసిన అనంతరం ఆ దేశ ప్రతిస్పందన చూశాం. భారత్‌పై నిందలు వేసేందుకు చేసిన వారి ప్రయత్నాలన్నీ ముందస్తుగా ఊహించినవే. వారి ఆరోపణలను తిరస్కరిస్తున్నాం. ప్రమాదకర విన్యాసాలు, కసరత్తులు చేసి.. 1991లో భారత్–పాక్ చేసుకున్న ఒప్పందంలోని అంశాలను పాక్ ఉల్లఘించింది. సముద్రంలో ఢీకొనడాన్ని నిరోధించే అంతర్జాతీయ నిబంధనలను సైతం పాటించకుండా తీవ్ర ఉల్లంఘనలకు పాల్పడింది" అని జయస్వాల్ స్పష్టం చేశారు. అయితే, ఈ ఘటనలో భారత నౌకాదళానికి చెందిన యుద్ధనౌక ఐఎన్ఎస్ కోల్‌కతా (×చీూ ఖశీశ్రీ‌ఱజ్ఞు)కు పెద్దగా నష్టం జరగలేదని, ప్రస్తుతం సముద్రంలోనే ఉందన్నారు.

## రాయలసీమ పౌరుషం ఏమిటో చూపిస్తాం

- మొదటి పేజి తరువాయి

త్వరలోనే నూతన ప్రాంతీయ రాజకీయ పార్టీ రాబోతోందని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి వెల్లడించారు. అనంతపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, టీడీపీ, వైసీపీ రెండూ కుటుంబ రాజకీయాలకే ప్రాధాన్యమిచ్చాయని... అసలైన రాయలసీమ పౌరుషాన్ని, ప్రాంతీయ సంక్షేమాన్ని కాపాడే బాధ్యతను తమ నూతన పార్టీ తీసుకుంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులవుతున్నా రెడ్డి కార్పొరేషన్‌ను ఎందుకు పునరుద్ధరించలేదని ఆయన నిలదీశారు. రాష్ట్ర విభజన అనంతరం సీమ ప్రాంతానికే చెందిన నాయకులు ముఖ్యమంత్రులుగా పనిచేసినప్పటికీ, రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు, అభివృద్ధి పనులను నిర్లక్ష్యం చేశారని దుయ్యబట్టారు. చంద్రబాబు, జగన్ కుటుంబాలు కేవలం ఎన్నికల సమయంలోనే రాజకీయం చేస్తూ, సీమ నుంచి ప్రజల వలసలకు ప్రధాన కారణమయ్యారని ఆరోపించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే యువత భాగస్వామ్యంతో సీమను తిరిగి 'రతనాల సీమ'గా మారుస్తామని... అన్ని కులాలు, మతాల సంక్షేమానికి కట్టుబడి ఉంటామని అన్నారు

# విద్యార్థులకు నోట్స్,లుపెన్నులుఅందజేత

-బి.జె.పి.పార్టీ జిల్లా కార్యదర్శి బొర్రా కామేశ్వరి.



**వి.ఆర్.పురం పెన్.పవర్.సెప్టెంబర్.18:**మండలంలోని వడ్డిగూడెం ఎం.పి.యుపిఎస్.పాఠ శాలో5తరగతి చదువుతున్న,విద్యార్థులకుబి.జె.పి. జిల్లాకార్యదర్శి, బొర్రాకామేశ్వరి,నోట్స్,లుపెన్నులు అందజేశారు. ఈసందర్భంగా బి.జె.పి.జిల్లాకార్యదర్శి మాట్లాడుతూ విద్యార్థులుక్రమ శిక్షణతో, ఉంటూమంచి గాచదువుకుంటూ మీతల్లిదండ్రుల కుమీరుచదువుకు న్నపాఠశాలకు, మంచిపేరుతీసుకురావాలని,ఉన్నత శిఖరాలకుచేరు కోవాలని, అన్నారు.ఈకార్యక్రమంలో హెచ్.ఎం. వెంకటరమణ, ఉపాధ్యాయులురవిబాబు, కామేష్,వెంకటరాజు,కృష్ణ,అనూష,తదితరులు పాల్గొన్నారు.

# పెన్ పవర్

పోలవరం - ఏలూరు

తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన జైలు సూపరింటెండెంట్, ఫోరెన్సిక్ అధికారి





**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, సెప్టెంబర్ 18:**జిల్లా పోలీస్ కార్యాలయంలో తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్‌ను రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ డాక్టర్ వి.సన్యాసిరావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ డి.నరసింహ కిషోర్‌కు పూల మొక్కను అందజేశారు.ఈ సందర్భంగా పోలీస్ శాఖ, జైలు శాఖల మధ్య సమన్వయం, పరస్పర సహకారానికి సంబంధించిన అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ప్రజా భద్రత, నేర నియంత్రణలో వివిధ శాఖల మధ్య సమన్వయం ఎంతో కీలకమని అధికారులు పేర్కొన్నారు. అదేవిధంగా రాజమహేంద్రవరం రీజినల్ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ అసిస్టెంట్ డైరెక్టర్ జి.శ్రీలత కూడా జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఫోరెన్సిక్ సేవలు, నేర పరిశోధనలో శాస్త్రీయ ఆధారాల ప్రాధాన్యత, పోలీస్ శాఖతో సమన్వయం తదితర అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన ఈ మర్యాదపూర్వక భేటీల సందర్భంగా అధికారులు పరస్పరం అభినందనలు తెలియజేసుకున్నారు.

# ప్రాధాన్యత క్రమంలో సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం: ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి



సంబంధిత అధికారులకు తక్షణ చర్యలకు ఆదేశాలు

**గంగవరం /రాజవొమ్మంగి, పెన్ పవర్ సెప్టెంబర్ 18:** ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి తెలిపారు. శుక్రవారం రాజవొమ్మంగి మండలం వట్టిగెడ్డలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏపీఐఐసీ డైరెక్టర్, మండల పార్టీ అధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ముందుగా స్థానిక మండల నాయకత్వం దృష్టికి తీసుకురావాలని సూచించారు. అక్కడ పరిష్కారం కాని సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, వ్యక్తిగత సమస్యలకు సంబంధించి పలువురు ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందజేశారు.ప్రజల నుంచి వచ్చిన వినతులపై స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో చరవాణిలో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చేపట్టిన పరిష్కార చర్యలను తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు.ప్రజలు తమ సమస్యలను నేరుగా తనకు తెలియజేసే అవకాశం ఉందని, ఎమ్మెల్యే కార్యాలయానికి వచ్చినా సమస్యలను తెలియజేస్తే వెంటనే స్పందిస్తామని ఆమె పేర్కొన్నారు. వచ్చిన ప్రతి సమస్యను పరిశీలించి, ప్రాధాన్యత క్రమంలో పారదర్శకంగా క్రమానుగతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే శిరీషాదేవి హామీ ఇచ్చారు.కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్, మండల పార్టీ అధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు, ఏఎంసీ చైర్మన్ లోతా లక్ష్మణరావు, రాజవొమ్మంగి సొసైటీ చైర్మన్ ముప్పన కేశవ్, ఏఎంసీ డైరెక్టర్ గట్టి మాణిక్యం, నియోజకవర్గ తెలుగు మహిళ నాయకురాలు ముప్పన సావిత్రి, నియోజకవర్గ బీసీ విభాగం ఉపాధ్యక్షుడు మాకిరెడ్డి లోవరాజు, మండల తెలుగుయువత అధ్యక్షుడు బారంగి అనుదీప్, మండల నాయకులు జెట్టి మధు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు సూరిశెట్టి సురేష్, టీడీపీ నాయకులు వానపల్లి చిట్టిబాబు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ





★ జిల్లా వ్యాప్తంగా 254 రైతు సేవా కేంద్రాల్లో పీపీసీల ఏర్పాటు

★ కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, సెప్టెంబర్ 18:**జిల్లాలో రైతులు పండించిన ధాన్యాన్ని ఎటువంటి ఇబ్బందులు లేకుండా, పారదర్శకంగా, సకాలంలో కొనుగోలు చేసేలా పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు.

శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో 2026-27 ఖరీఫ్ ధాన్యం కొనుగోలు, సేకరణకు సంబంధించిన డీపీసీ సమావేశం కలెక్టర్ కీర్తి చేకూరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ధాన్యం సేకరణకు చేసిన ఏర్పాట్లు, కొనుగోలు కేంద్రాలు, గోనె సంచుల లభ్యత, ధాన్యం రవాణా, మిల్లులకు తరలింపు, ఎలినినో నేపథ్యంలో దిగుబడులు, సేకరణ లక్ష్యాలు తదితర అంశాలను సమీక్షించారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ రైతులకు కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన కనీస మద్దతు ధర అందేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున ఏపీఎస్‌సీఎస్‌సీఎల్ రైతుల నుంచి నేరుగా ఆర్ఎస్‌కేల ద్వారా రైతు పొలం వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేయనుందన్నారు. 2026--27 ఖరీఫ్ సీజన్‌లో గ్రేడ్--ఏ రకానికి క్వింటాల్‌కు రూ.2,461, సాధారణ రకానికి రూ.2,441 గా నిర్ణయించారు. గత ఏడాదితో పోలిస్తే క్వింటాల్‌కు రూ.72 పెరిగింది. ఎల్‌నినో ప్రభావంతో ఈ సీజన్‌లో దిగుబడుల్లో మార్పులు ఉండే అవకాశం ఉన్నందున, వాస్తవంగా వచ్చే దిగుబడులు, మార్కెట్‌కు వచ్చే ధాన్యం పరిమాణాన్ని నిరంతరం అంచనా వేస్తూ రైతులకు పూర్తి ప్రయోజనం కలిగేలా అవసరమైన మేరకు సేకరణకు ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం జిల్లాలో 96,266 హెక్టార్లలో వరి సాగు జరుగుతుండగా, సుమారు 7,12,178 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి, 1,06,827 మెట్రిక్ టన్నుల మార్కెట్ రాకలు ఉండవచ్చని అంచనా వేశారు. వరి కోతలు అక్టోబర్ మూడో వారంలో ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున, మండలాల వారీగా ధాన్యం రాకలు, సన్న రకాల రాకలు, కోతలు అధికంగా జరిగే కాలం, సేకరణ పీక్ పీరియడ్‌ను ముందుగానే అంచనా వేసి అందుకు అనుగుణంగా కొనుగోలు ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ కీర్తి సూచించారు. ఖరీఫ్ సీజన్‌లో ఆకస్మికంగా సంభవించే తుఫాన్లు, వర్షాల నేపథ్యంలో ధాన్యానికి నష్టం వాటిల్లకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న 3,300 టార్పాలిన్లను రైతు సేవా కేంద్రాలకు అందించినట్లు అధికారులు తెలిపారు. ధాన్యం రవాణా వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, కొనుగోలు చేసిన ధాన్యం ఎక్కడా నిల్వ ఉండకుండా సకాలంలో మిల్లులకు తరలించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులకు కనీస మద్దతు ధర అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వ్యవసాయం, పౌరసరఫరాలు, మార్కెటింగ్, రవాణా తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. జిల్లాలోని 254 రైతు సేవా కేంద్రాల్లో పీపీసీలు ఏర్పాటు చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ తెలిపారు. వీటిలో రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో 137, కొవ్వూరు డివిజన్ పరిధిలో 117 పీపీసీలు ఏర్పాటు చేయనున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు ధాన్యం నాణ్యత, తేమ శాతం పరిశీలనను నిబంధనల ప్రకారం నిర్వహించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలు, మిల్లుల వద్ద తేమ శాతం కొలతల్లో వ్యత్యాసం లేకుండా మిల్లర్ల ప్రతినిధుల సమక్షంలో తేమను పరిశీలించాలని సివిల్ సప్లై అధికారులను ఆదేశించారు. రైతులకు అందించే గోనె సంచుల నాణ్యతను ముందుగానే పరిశీలించి నాణ్యమైన గోనె సంచులు అందుబాటులో ఉంచాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ వై.మేఘా స్వరూప్, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ బి.గణేష్, డీఎస్ఓ వి.పార్వతి, జిల్లా వ్యవసాయ అధికారి బి.వెంకటేశ్వరరావు, జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్, జిల్లా సహకార అధికారి ఎమ్.వెంకట రమణ, వ్యవసాయ, పౌరసరఫరాలు, మార్కెటింగ్, లీగల్ మెట్రాలజీ, ఎఫ్‌సీఐ అధికారులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఇ. సత్యనారాయణ, ఎస్.రమేష్, ఎస్.శివరామకృష్ణ, వి.బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

## పోలవరం జిల్లాకు

# పూర్తిస్థాయి ఎస్పీ, శాఖాధికారులను నియమించాలి



★ ఇన్‌చార్జ్ వ్యవస్థను రద్దు చేయాలి.

★ ఆదివాసీ సంక్షేమ పరిషత్ డిమాండ్

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ సెప్టెంబర్ 18:** పోలవరం జిల్లాకు పూర్తిస్థాయి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్‌తో పాటు అన్ని ప్రభుత్వ శాఖలకు పూర్తిస్థాయి అధికారులు, సిబ్బందిని తక్షణమే నియమించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుజ శ్రీను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రంపచోడవరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.జిల్లా ఆవిర్భవించి దాదాపు ఏడాది కావస్తున్నప్పటికీ పూర్తిస్థాయి ఎస్పీని నియమించకపోవడం విచారకరమని కుజ శ్రీను అన్నారు. జిల్లాకు కలెక్టర్‌ను నియమించిన ప్రభుత్వం పోలీసు శాఖకు మాత్రం పూర్తిస్థాయి ఎస్పీని నియమించడంపై దృష్టి సారించకపోవడం తగదన్నారు. ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ పోలవరం జిల్లాకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారని తెలిపారు.ఇన్‌చార్జ్ వ్యవస్థ కారణంగా శాంతిభద్రతల పర్యవేక్షణపై ప్రభావం పడుతోందని, పలు పోలీస్ స్టేషన్లలో బాధితుల ఫిర్యాదులపై సకాలంలో చర్యలు తీసుకోకపోవడంతో కేసులు పెండింగ్‌లో ఉంటున్నాయని ఆయన ఆరోపించారు. బాధితులు నెలల తరబడి పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొన్నారు. జిల్లాకు పూర్తిస్థాయి ఎస్పీ అందుబాటులో ఉంటే క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను ఉన్నతాధికారి దృష్టికి నేరుగా తీసుకెళ్లే అవకాశం ప్రజలకు ఉంటుందని అన్నారు.ఏజెన్సీ ప్రాంతాల్లోని సివిల్ వివాదాల్లో కొన్ని సందర్భాల్లో స్థానిక పోలీసులు అనవసరంగా జోక్యం చేసుకుంటున్నారని కుజ శ్రీను ఆరోపించారు. ఇటువంటి సమస్యలకు అడ్డుకట్ట వేసేందుకు ఉన్నతస్థాయి పర్యవేక్షణ అవసరమని తెలిపారు.

**అన్ని శాఖలకు పూర్తిస్థాయి అధికారులు అవసరం**

కేవలం పోలీసు శాఖకే కాకుండా జిల్లాలోని పలు కీలక ప్రభుత్వ శాఖలు కూడా ఇప్పటికీ ఇన్‌చార్జ్ అధికారుల ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయని ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు తెలిపారు. దీనివల్ల ప్రజా సమస్యల పరిష్కార వేదిక, కలెక్టరేట్‌లో దాఖలయ్యే ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు.ఉద్యోగుల నియామకాలు, బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన వ్యవహారాలు కాకినాడ కలెక్టర్ కార్యాలయం పరిధి నుంచే కొనసాగుతున్నాయని, దీనివల్ల నూతన జిల్లా ఏర్పాటు లక్ష్యం పూర్తిస్థాయిలో నెరవేరడం లేదని వారు అభిప్రాయపడ్డారు.

పోలవరం జిల్లాలో పరిపాలనను మరింత పటిష్టం చేసేందుకు ఇన్‌చార్జ్ వ్యవస్థను రద్దు చేసి అన్ని శాఖలకు పూర్తిస్థాయి అధికారులను, అవసరమైన సిబ్బందిని వెంటనే నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. చింతూరు ఐటీడీఏకు ప్రత్యేక గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలకు శాశ్వత భవనాలను నిర్మించాలని, ఇందుకోసం ప్రధాన రహదారుల పక్కన ప్రభుత్వ భూములను గుర్తించి, ఆక్రమణల్లో ఉన్న ప్రభుత్వ భూములను నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకుని వినియోగించాలని సూచించారు.ఈ సమావేశంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు చోడి ప్రదీప్‌కుమార్ దొర, పీఠ ప్రసాద్, కంగాల అబ్బాయి దొర, చోడి డి. ఏడుకొండలరావు దొర, బల్లెం గంగాభవాని, కారు అరుణకుమారి, పరదా శివరాంకృష్ణ దొర, కల్మల ప్రసాద్ దొర, కోటం రాజన్న దొర తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపల్లి లో గోకవరం తహసీల్దార్ పేరు చెప్పి మరి అక్రమ మట్టి తవ్వకాలు.





**గోకవరం పెన్ పవర్ సెప్టెంబర్ 18:-** మండలంలో అక్రమ మట్టి మాఫియా ఏదేచ్ఛగా దర్జాగా జరుగుతుంది కనీసం అనుమతులు ఉండవు. అది ఏంటి అని అడిగితే తాసిల్దార్ గారికి చెప్పే తోలుతున్నామంటూ దర్జాగా చెబుతూ ఉంటారు మట్టి మాఫియా ఈ విషయంపై తాసిల్దార్ వివరణ కోరెందుకు ఫోన్ లైన్ లో ప్రయత్నించిన ఆయన ఫోన్ తీయరు ఒకటి కాదు రెండు సార్లు ఎవరు ఫోన్ చేసినా ఫోన్ తీయరు దీనితో మట్టి మాఫియా ఆరోపిస్తున్న ఆరోపణలకు మరింత బలం చేకూరుతుంది ఎప్పుడు లేని విధంగా గోకవరంలో మట్టి మాఫియా తాసిల్దార్ పేరు ఉపయోగించడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని పలువురు వాపోతున్నారు. గత పది రోజులుగా గోకవరం మండలం కొత్తపల్లి గ్రామంలోని పెద్దపాత్రుని చెరువులో అక్రమ మట్టి తవ్వకాలు యదేచ్చిగా కొనసాగుతూనే ఉన్నాయి . ఈ విషయం తెలిసి కొంతమంది మీడియా మిత్రులు అక్రమ మట్టి తోలుకొందారులను అనుమతులు ఉన్నాయని ప్రశ్నిస్తే తాసిల్దార్ గారే మమ్మల్ని తోలుకోమన్నారని కావాలంటే తాసిల్దార్ని అడగండి అంటూ విలేకరులపై దృష్టిగా ప్రవర్తించడంతో సదరు విలేకరులు వెళ్లి గోకవరం తాసిల్దార్ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నట్లు పుకార్ల షికారులు చేస్తున్నాయి. కొత్తపల్లి గ్రామంలోని నిరంతరంగా మట్టి తవ్వకాలు, తరలింపులు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని దీనితో అక్రమట్టి రవాణా చేస్తున్న వ్యక్తులు అంటున్నట్లుగా తాసిల్దార్ ఇందులో ప్రమేయం ఉందా అని అనుమానాలు కి బలం చేకూరుతుంది. అలాకాకుండా ఒక మండల తాసిల్దార్ పేరు చెప్పి దర్జాగా ఎందుకు అక్రమ జరుగుతుంది అని ఆలా లేకపోతే ఎందుకు మట్టి తోలకాలని ఎందుకు నిరోధించలేకపోతున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. సచివాలయం దగ్గర నుండే యదేచ్చగా రాత్రి పగలు అక్రమట్టి తవ్వకాలు జరుగుతున్న సంబంధిత నీటిపారుదల శాఖ మరియు రెవెన్యూ శాఖ అధికారులు పట్టించుకోకపోవడం తో పలు ఆరోపణలకు మరింత ఊతమిచ్చినట్లు అవుతుందని పలువురు అంటున్నారు. ఇంత పెద్ద ఎత్తున తవ్వకాలు కొనసాగితే చెరువు స్వరూపం దెబ్బతినడంతో పాటు భవిష్యత్తులో ప్రమాదకర పరిస్థితులు ఏర్పడే పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని స్థానిక రైతులు ఆందోళ వ్యక్షు చేస్తున్నారు. చెరువులో తవ్వకాలు చేసి మట్టి రవాణా జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.గ్రామీణ ప్రాంతా ల్లో చెరువులు, సాగునీటి అవసరాలతో పాటు భూగర్భ జలాల పరిరక్షణలోనూ కీలక పాత్ర పోషిస్తాయి. ఇలాంటి చెరువుల్లో అనుమతులు లేకుండా. నిబంధనలను ఉల్లంఘించి మట్టి తవ్వకాలు జరిగితే పర్యావరణానికి భద్రతాపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందని స్థాపకులు పేర్కొంటున్నారు. కొత్తపల్లి పెద్దపాత్రుని చెరువులో జరుగుతున్నట్లు మట్టి తవ్వకాలపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోవడం లేదని అసలు అధికారులు ఉన్నట్టా లేనట్టా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. గోకవరం మండలం లో జరుగుతున్న అక్రమ మట్టి తోలుకలపై కలెక్టర్ స్పందించకపోతే భవిష్యత్తులో గోకవరం మండలం రూప రేఖలు మారే ప్రమాదం కూడా ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# రాష్ట్రము లో సూపర్ సిక్స్ హామీలు అమలు ఎక్కడ!

* ధరలు పెరుగుదల, కరవు నివారణ చర్యలు తీసుకోవడం ప్రభుత్వం వైఫల్యం




**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 18:**రాష్ట్రము లో సూపర్ సిక్స్ హామీలు అమలు ఎక్కడ!
ధరలు పెరుగుదల, కరవు నివారణ చర్యలు తీసుకోవడం లో చంద్రబాబు ప్రభుత్వం వైఫల్యం!
చంద్రబాబు అధికారం లోకి వచ్చి రెండు సంవత్సరాలు అయినప్పటికీ సూపర్ సిక్స్ హామీలు అమలు లో ఘోరంగా వైఫల్యం చెందారని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం వెస్ట్ గోదావరి జిల్లా జనరల్ బాడీ సమావేశం జిల్లా అధ్యక్షులు కలిశెట్టి వెంకట్రావు అధ్యక్షతన తాడేపల్లిగూడెం లోని కపర్తి భవన్ లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా హాజరైన ఆవుల శేఖర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చినప్పటినుండి సూపర్ సిక్స్ హామీలు గాలికొదిలేసారని అన్నారు. విచ్చలవిడిగా పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు అదుపు చేయడం లో చంద్రబాబు విఫలం చెందారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వర్షాలు లేక పేదలు వలసలు పోతున్నా కరవు నివారణ చర్యలు ఏవని ఆయన ప్రశ్నించారు. కనీసం కరవు పై మాట మాత్రం కూడా మాట్లాడటం లేదని, ఇటీవల జరిగిన జిల్లా కలెక్టర్ల సమావేశం లో కూడా కరవు నివారణ పై మాట్లాడకపోవడం చాలా విడ్డురం అన్నారు. చంద్రబాబు రాష్ట్రము లో విపరీతంగా లక్షల కోట్లు అప్పులు తెచ్చి కార్పొరేట్లకు ఉపయోగపడే పనులు చేస్తున్నారని అన్నారు. పేదల కష్టాలను పట్టించుకోవడం లేదని, ఇప్పటికే గ్రామాలు ఖాళీ చేసి ఇతర ప్రాంతాలకు వలసలు వెళుతున్నా ఉపాధి హామీ పనులు పెట్టడం లేదని అన్నారు. ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పెన్షన్లు, పక్కా గృహలు ఇవ్వడం లో నిర్లక్ష్యం తగదని అన్నారు. పెన్షన్లు మంజూరు కు 19 రోజులే గడువు పెట్టడం మంచిది కాదన్నారు. ఇప్పటికయినా కరవు నివారణ చర్యలు తీసుకోవాలని, గ్రామీణ పేదలు, రైతులు, చేతి వృత్తి దారులు, కౌలు దారులకునెలకి 10 వేల రూపాయలు కరవు పెన్షన్ ఇవ్వాలని, కుటుంబానికి 35 కేజీ ల బియ్యం తో పాటు 16 రకాల నిత్యావసర వస్తువులు రేషన్ షాప్ ల ద్వారా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కోణాల భీమారావు మాట్లాడుతూ కేంద్రం లో మోడీ ప్రభుత్వం 12 సంవత్సరాలనుండి విద్య, వైద్యం, పేదలకు అందుబాటులో లేకుండా చేసారని, దళితులు, గిరిజనులు పై దాడులు, హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నా మోడీ మౌన మునిలా వుంటున్నారని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘము రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 80 సంవత్సరాలు అయినప్పటికీ పేదలు ఇంకా పేదలుగానే కొనసాగుతున్నారని, కేంద్రంలో నరేంద్ర మోడీ రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వాలు పేదలకు చేసింది ఏమీ లేదని అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ భూములన్ని కనుమరుగయ్యేలా చంద్రబాబు ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నదని అన్నారు. భూ పోరాటాల ద్వారా ప్రభుత్వ భూములను ఇళ్ల స్థలాలు, సాగు భూములకు పేదలకు పంచడానికి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కార్యకర్తలు ముందుకు రావాలని కోరారు. ఈ సమావేశంలో తాడేపల్లిగూడెం మండల కార్యదర్శి మండల నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు జయచంద్ర, సనపల శ్రీనివాసులు, చౌదరి, శాంతి కుమారి, కోన గొల్లయ్య, యూ నాగలక్ష్మి యన్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీలో చేర్పులు మార్పులు చేయడం జరిగిందని జిల్లా అధ్యక్షులు కలిసెట్టి వెంకట్రావు తెలిపారు.

## తాడేపల్లిగూడెం రైతు బజార్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 18:**తాడేపల్లిగూడెం పట్టణంలోని టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న రైతు బజార్‌ను తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే ಡ ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు.
ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్న రైతు బజార్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే నెల రోజుల్లోపు శుభ్రపరిచి రైతులకు, వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాలకు చెందిన రైతులు తమ కూరగాయలను రైతు బజార్‌లోనే విక్రయించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.
రైతులకు అనుకూలమైన మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు అందేలా చర్యలు చేపట్టనున్నట్లు బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## చేబ్రోలు రైల్వే అండర్‌పాస్ మూసివేత

* పాదచారులు, వాహనదారులు సంచరించవద్దని హెచ్చరిక బోర్డులు






**పెన్ పవర్ ఉంగుటూరు, సెప్టెంబర్ 18:** విజయవాడ--విశాఖపట్నం రైలు మార్గంలో ఉన్న చేబ్రోలు రైల్వే అండర్‌పాస్‌ను రైల్వే అధికారులు శుక్రవారం మూసివేశారు. అండర్‌పాస్ నిర్మాణం కాలక్రమేణా బలహీనపడటంతో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు చేపట్టారు. అండర్‌పాస్‌కు ఇరువైపులా ఇనుప గెడ్డర్లను అడ్డంగా బిగించి రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. బ్రిటిష్ కాలంలో నిర్మించిన ఈ అండర్‌పాస్‌లోని పైకప్పు, గోడలు బలహీనపడినట్లు సాంకేతిక బృందం గుర్తించినట్లు అధికారులు తెలిపారు. నిర్మాణం శిథిలావస్థకు చేరిన నేపథ్యంలో ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా మూసివేసినట్లు పేర్కొన్నారు. చేబ్రోలు రైల్వే గేటు మూసివేసిన సమయంలో ప్రత్యామ్నాయ మార్గంగా ఈ అండర్‌పాస్‌ను ప్రజలు, వాహనదారులు నిత్యం విస్తృతంగా వినియోగిస్తుంటారు. అయితే ప్రస్తుతం అండర్‌పాస్ మూసివేయడంతో ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. అండర్‌పాస్ వద్ద పాదచారులు, వాహనదారులు ఎవరూ ప్రవేశించవద్దని హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ మార్గం ప్రధానంగా వరద నీటి ప్రవాహం కోసం నిర్మించబడినదని, ప్రజల రాకపోకలకు ఉపయోగించే మార్గం కాదని అధికారులు సూచించినట్లు సమాచారం. నిర్మాణ భద్రతపై తదుపరి చర్యలు చేపట్టే వరకు ఎవరూ అండర్‌పాస్‌లోకి వెళ్లకూడదని స్పష్టం చేశారు.

## ఉచిత వైద్య, రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**జీలుగుమిల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 18;** మండల కేంద్రంలోని గ్రేస్ మందిర్ వ్యవస్థాపకులు బి ఎజ్రా శాస్త్రి ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం మమతా హాస్పిటల్ వైద్య బృందం తో ఉచిత వైద్య శిబిరాన్ని, శ్రీ సూర్య బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. శుక్రవారం జీలుగుమిల్లి గ్రేస్ మందిరలో ఉచిత వైద్య, రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు .సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు ఈ ఉచిత వైద్య శిబిరం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు .ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం సేవా సంస్థలు, ఆసుపత్రులు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయడం స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పదం వెంకటకృష్ణ ,నేలటూరి మోహన్, మమతా హాస్పిటల్ డాక్టర్లు, సిబ్బంది, గ్రేస్ మందిర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## నారాయణపురం సొసైటీని సందర్శించిన అరుణాచల్‌ప్రదేశ్ సహకార బ్యాంకు అధికారులు





**పెన్ పవర్ ఉంగుటూరు, సెప్టెంబర్ 18:**అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంకు అధికారుల బృందం శుక్రవారం చేబ్రోలు విశాల సహకార సంఘం పరిధిలోని నారాయణపురం సొసైటీని అధ్యయనం కోసం సందర్శించింది. జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు ఆధ్వర్యంలో సొసైటీ నిర్వహణ, కార్యకలాపాలు, ఇతర వ్యవహారాలపై అవగాహన పొందేందుకు అధికారులు ఈ పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ కడియాల రవిశంకర్, ముఖ్య కార్యనిర్వహణాధికారి అయ్యంకి రంగనగేష్ సొసైటీ అభివృద్ధి, నిర్వహణ, కార్యకలాపాలపై అరుణాచల్‌ప్రదేశ్ అధికారులకు వివరించారు. అనంతరం అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంకు ఎండీ బిట్లుక్రి, జనరల్ మేనేజర్ టాబ్ఓయా, డీజీఎం నాబమ్, ఏజీఎం నబమ్‌టాటి తదితర అధికారులను సొసైటీ తరపున ఘనంగా సత్కరించారు.

## బాస్కెట్‌బాల్‌లో జాతీయ స్థాయికి పునీత్ అడుగు!



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 18.**అండర్-14 సబ్‌జూనియర్ బాస్కెట్‌బాల్‌లో ప్రతిభ కనబరిచి, ఆంధ్రప్రదేశ్ సబ్‌జూనియర్ జట్టు ఫైనల్ కోచింగ్‌కు ఎంపికైన పునీత్‌కు తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే ಡ ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ తరఫున హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. చిన్న వయసులోనే క్రీడల్లో ప్రతిభను చాటుతూ రాష్ట్ర జట్టు ఫైనల్ కోచింగ్‌కు ఎంపిక కావడం ఎంతో గర్వకారణం. క్రమశిక్షణ, కృషి, పట్టుదలతో మరింతగా సాధన చేసి జాతీయ స్థాయిలో రాణించి ఆంధ్రప్రదేశ్‌కు, తాడేపల్లిగూడెంకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నాం. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు.
నీ ప్రతిభకు మా ప్రోత్సాహం...
నీ విజయానికి మా శుభాకాంక్షలు తెలియజేసారు.

## తాడేపల్లిగూడెంలో కాలువల ప్రక్షాళనకు చర్యలు.



**కాలువను శుభ్రపరచడంతో పాటు అవసరమైన చోట రిటైనింగ్ వాల్స్ ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశం.**

**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 18:**తాడేపల్లిగూడెం పట్టణంలోని తణుకు రోడ్డు నుండి పత్తిపాడు వరకు ఉన్న కాలువను తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే ಡ ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అధికారులతో కలిసి పరిశీలించారు.
కాలువ పక్కన పెరిగిన చెట్లు, పిచ్చి మొక్కలను తొలగించి, కాలువను శుభ్రపరచడంతో పాటు అవసరమైన చోట రిటైనింగ్ వాల్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.
కాలువలో పూడిక, చెత్తాచెదారాలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా చర్యలు చేపట్టాలని, నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలని సూచించారు.
అలాగే కాలువల్లో చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.
మున్సిపల్ మరియు ఇరిగేషన్ శాఖల సమన్వయంతో కాలువల అభివృద్ధి, పరిశుభ్రత మరియు పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు.
ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తాడేపల్లిగూడెం పట్టణంలో కాలువల నిర్వహణ, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



## వీబీ రామ్‌జీలో కొత్త పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి

పంచాయతీరాజ్ అధికారులతో సమీక్షించిన ఎమ్మెల్యే ధర్మరాజు



**పెన్ పవర్ ఉంగుటూరు సెప్టెంబర్ 18:**వీబీ రామ్‌జీలో కొత్త అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అధికారులను ఆదేశించారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్ అధికారులతో నియోజకవర్గ అభివృద్ధి పనులపై ఆయన సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో రూ.20 కోట్ల నుంచి రూ.25 కోట్ల వరకు అభివృద్ధి పనులకు అంచనాలు సిద్ధం చేసి, అనుమతుల కోసం వెంటనే ప్రతిపాదనలు పంపాలని అధికారులకు సూచించారు. అలాగే సాస్కీ పథకంలో భాగంగా నియోజకవర్గానికి ఐదు పనులు మంజూరయ్యాయని తెలిపారు. ఆయా పనులను ఈ నెల 24న ప్రారంభించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే ధర్మరాజు తెలిపారు. ఈ సమీక్షలో పంచాయతీరాజ్ ఈఈ సత్యంనాయుడు, డీఈ వేణుగోపాల్, ఉంగుటూరు, నిడమర్రు ఏఈలు కృష్ణమోహన్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

# బాధితులకు సత్వర న్యాయం, సేవలే వన్ స్టాప్ సెంటర్ల లక్ష్యం




**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 18:**మహిళలకు అన్యాయం జరిగినప్పుడు వారికి అండగా నిలిచి, బాధితులకు సత్వర న్యాయం, సహాయాన్ని అందించడంలో వన్ స్టాప్ సెంటర్ల పాత్ర కీలకమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలోని మాత శిశు విభాగంలో ఏర్పాటు చేసిన వన్ స్టాప్ సెంటర్ల సిబ్బంది అవగాహన కార్యక్రమానికి రాయపాటి శైలజ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం మీడియాతో శైలజ మాట్లాడుతూ, బాధిత మహిళలకు అందించే సేవల్లో వేగం పెంచే ఉద్దేశంతో వన్ స్టాప్ సెంటర్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నేషనల్ కమిషన్ ఫర్ ఉమెన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ సంయుక్త ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తు న్నామని తెలిపారు. 16 జిల్లాల్లో వన్ స్టాప్ సెంటర్ల సిబ్బందికి అవగాహన నిర్వహించినట్లు చెప్పారు. పని ప్రదేశంలో హింస, వేధింపులు, ఇతర ఇబ్బందులకు గురైన మహిళలకు ఒకే చోట అవసరమైన సహాయం అందించడం వన్ స్టాప్ సెంటర్ల ప్రధాన ఉద్దేశ్యమని చైర్ పర్సన్ శైలజ వివరించారు. బాధితులకు లీగల్ కౌన్సిలింగ్, ఎఫ్ఐఆర్ నమోదులో సహాయం, పోలీసు అధికారుల సమక్షంలో కేసుల డాక్యుమెంటేషన్, న్యాయప అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించినట్లు తెలిపారు. నిర్దేశిత మార్గదర్శకాలు, సిబ్బంది బాధ్యతలు, బాధితులతో వ్యవహరించాల్సిన విధానాలపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. సిబ్బంది మానసిక ఒత్తిడిని అధిగమించేలా సైకియాట్రిస్టులతో ప్రత్యేక తరగతులు నిర్వహించ నున్నట్లు చైర్ పర్సన్ తెలిపారు. సంబంధిత విభాగాల్లో నిపుణులు సూచనలు, సలహాలు అందించారు. బాధిత మహిళలకు సున్నిత సేవలందిస్తూ, వారి గోప్యతను కాపాడటం, కేసుల వివరాలను సమగ్రంగా నమోదు చేయడం,అవసరమైన విభాగాలతో సమన్వయం తో సత్వర సహాయం అందించడం వంటి అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న మోసాలు, వేధింపుల పట్ల యువతులు, మహిళలు అప్రమత్తంగా ఉండాలని రాయపాటి శైలజ సూచించారు. మహిళల భద్రతకు 'శక్తి యాప్'ను విస్తృతంగా వినియోగించు కోవాలని కోరారు. పిల్లల సోషల్ మీడియా వినియోగంపై తల్లిదండ్రులు బాధ్యతగా పర్యవేక్షించాలని, పిల్లల సోషల్ మీడియా వినియోగంపై నియంత్రణ ఇంటి నుంచే ప్రారంభం కావాలని ఆమె సూచించారు.ఈ కార్య క్రమంలో కొవ్వూరు ఆర్డీవో కె ఆనంద రావు, డీఎస్పీ ఏ. శివప్రియ, పోలవరం, అల్లూరి జిల్లాల డీఎస్పీలు వేణుగోపాల్ , ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి సూపరింటెండెంట్ సోఫియా, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్లు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## 41వ డివిజన్‌లో మార్గాని భరత్ ఎన్నికల ప్రచారం



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 18:**త్వరలో జరిగే కార్పొరేషన్ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులను గెలిపించడం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందని మాజీ ఎంపీ, వైసిపి జాతీయ అధికార ప్రతినిధి, సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మార్గాని భరత్ రామ్ అన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో వైసిపి గెలుపే లక్ష్యంగా కార్యా చరణ ప్రారంభించిన మార్గాని భరత్ రామ్ స్థానిక 41వ డివిజన్ కోటిలింగాల పేటలో వల్లూరి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం పర్యటించారు. నగరం లో టీడీపీ ఎమ్మెల్యే కు ప్రజా సమస్యలు పట్టవన్నారు. మద్యం మాఫియా, ఇసుక మాఫియాను ప్రోత్సహిస్తూ డబ్బు సంపాదించు కోవడమే ధ్యేయంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. వైసిపి అభ్యర్థులను గెలిపిస్తే కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారం చేస్తారన్నారు. . వైసిపి నాయకులు, కార్యకర్తలు సమన్వయం తో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని కోరారు. ఆయన వెంట వైసిపి నాయకులు ఉమాయదవ్, సుభానీ, వల్లూరి రాజ్‌కుమార్, జల్లి కోటి, బెల్లాపు అప్పన్న, రాయల కోటేశ్వరి, కర్రిపోతు జగదీశ్వరి, మానస, జల్లి అమృత, గుర్రం బేబీ, కాగిత నాగమణి, చిత్రకళా బాబ్జీ, రేగుళ్ల బాలశ్రీధర్ తదితరులు ఉన్నారు.

## హుకుం పేటలో పీఎం స్వనిధి రుణమేళా లో దరఖాస్తుల స్వీకరణ

మెప్మా పిడి కనకరాజు




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 18:**పట్టణ ప్రాంతాల సమీపంలోని గ్రామాల్లోని వీధి వ్యాపారులకు రుణ సదుపాయం కల్పించేందు కు ప్రధానమంత్రి స్వనిధి పథకం ద్వారా చర్యలు చేపడుతున్నట్లు మెప్మా పీడీ టి. కనకరాజు తెలిపారు. శుక్రవారం హుకుంపేట పంచాయతీ పరిధిలోని కార్యాలయం ఆవరణలో 'పీఎం స్వనిధి రుణ మేళా' నిర్వహించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పట్టణ ప్రాంతాలకు సమీపంలోని గ్రామాలైన హుకుం పేట, మోరంపూడి, కాతేరు, ధవళేశ్వరం, వెంకటనగరం, బొమ్మూరు, తొర్రేడు, పిడింగొయ్య గ్రామాల్లోని వీధి వ్యాపారులను పథకం పరిధిలోకి తీసుకు వచ్చినట్లు తెలిపారు.
కేంద్ర ప్రభుత్వ ఎన్ యు ఎల్ ఎం మార్గదర్శకాల మేరకు నగర సమీపంలోని ఆయా గ్రామాల్లో వీధి వ్యాపారులను ఎన్యుమరేటర్ల ద్వారా సర్వే చేసి గుర్తించినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా శుక్రవారం హుకుం పేటలో గుర్తించిన 50 మంది వీధి వ్యాపారులకు బ్యాంక్ ఆఫ్ బరోడా ద్వారా మొదటి విడతగా ఒక్కొక్కరికి రూ. 15,000 రుణం మంజూరు చేసేందుకు దరఖాస్తులను స్వీకరించి, ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు మెప్మా పీడీ తెలిపారు. ఆయా గ్రామాల్లో ఇంకా గుర్తించని లేదా రుణం కోసం దరఖాస్తు చేసుకోని వీధి వ్యాపారులు రుణ సదుపాయం పొందేందుకు నగరపాలక సంస్థలోని మెప్మా విభాగాన్ని సంప్రదించాలని టి. కనకరాజు సూచించారు. అర్హులైన వీధి వ్యాపారులు ఈ అవకాశాన్ని వినియో గించుకోవాలని కోరారు.
ఈ కార్యక్రమంలో జిల్లా సిబ్బంది పి. శ్రీదేవి, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ వి. రామలక్ష్మి, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## చవితి ఉత్సవాలు భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక



**జీలుగుమిల్లి, పెన్ పవర్, సెప్టెంబర్18;**వినాయక చవితి ఉత్సవాలు భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని మాజీ జెడ్పీటీసి, జనసేన సీనియర్ నాయకులు, ద్వారక తిరుమల శ్రీ చిన్న వెంకన్న దేవస్థానం స్టేట్ ట్రస్టు బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు గడ్డమణుగు రవికుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గౌడ సంఘం , స్థానిక రామన్నపాలెం యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాలను రవికుమార్, దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో భక్తి భావన, ఆధ్యాత్మిక చింతనలను పెంపొందిస్తాయని అన్నారు. ఉత్సవాల ముగింపు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన అధ్యక్షులు పసుపులేటి రాము, చిర్రి శ్రీను, ఉలవలముత్యం, చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు, చిట్టిబొమ్మ శ్రీనివాస్, నారగాని బుజ్జి, కొప్పుల దుర్గారావు, అఖిల్, ఉలవల శివ, చేబత్తుల అంజీ, బొంతు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అడ్డతీగలలో న్యాయ సేవలపై నూతన మాడ్యూల్ శిబిరం...

**అడతీగల, పెన్ పవర్, సెప్టెంబర్ 19:**గిరిజనుల హక్కుల పరిరక్షణ, మానవ --వన్యప్రాణి సంఘర్షణ బాధితులకు న్యాయ సహాయం, విద్యా అవకాశాలపై అవగాహన కల్పించేందుకు, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం అడతీగల సాయి సన్నిధి ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు నూతన మాడ్యూల్ శిబిరం నిర్వహించనున్నట్లు న్యాయ సేవాధికార సంస్థ అధికారులు తెలిపారు.
ఈ సందర్భంగా గిరిజనుల హక్కుల పరిరక్షణ, మానవ--వన్యప్రాణి సంఘర్షణ బాధితులకు న్యాయ సహాయం, శిక్ష--2026 పథకాలపై అవగాహన కల్పించనున్నారు.జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ --కమ్ -- ప్రిన్సిపల్ జిల్లా ు సెషన్స్ జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా ముఖ్య అతిథిగా హాజరవుతారు అని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వై. శ్రీలక్ష్మి, జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎస్. ప్రశాంత్ కుమార్, పోలవరం జిల్లా ఓఎస్డీ ఎం. జవాలి అల్ఫోన్స్ , రంపచోడవరం ఆర్డీఓ, ఇన్‌చార్జి డీఆర్ఓ కె. స్వాతి తదితరులు పాల్గొంటారని తెలిపారు.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం...



**అడ్డతీగల, పెన్ పవర్ ,సెప్టెంబర్ 18;** శుక్రవారం అడ్డతీగల సినిమా హాల్ కాలనీ సమీపంలో, గుర్తు తెలియని మృతదేహం చెట్ల పొదల్లో ఉండడంతో గుర్తించిన కాలనీవాసులు, పోలీసులకు సమాచారం అందించారు. అడ్డతీగల సీఐ ఎం. గజేంద్ర కుమార్, ఎస్సై బి. వినోద్ తమ సిబ్బందితో వెళ్లి మృతదేహం ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. అయితే మరణించిన వ్యక్తి ఎవరు అన్నది తెలియాల్సి ఉందని ఎస్ఐ వినోద్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్నామని తెలిపారు.

## నేడు గంగవరంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం



**గంగవరం, పెన్ పవర్ సెప్టెంబర్ 18:** గంగవరం మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని ఈ నెల 19వ తేదీ శనివారం సాయంత్రం 4 గంటలకు గంగవరం వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు యెజ్జు వెంకటేశ్వరరావు తెలిపారు.ఈ సమావేశానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ శాసనసభ్యురాలు నాగులపల్లి ధనలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని పార్టీ వివిధ విభాగాల కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## న్యాయ సేవలపై నూతన మాడ్యూల్ శిబిరం...

**అడతీగల, సెప్టెంబర్ 18;**గిరిజనుల హక్కుల పరిరక్షణ, మానవ -- వన్యప్రాణి సంఘర్షణ బాధితులకు న్యాయ సహాయం, విద్యా అవకాశాలపై అవగాహన కల్పించేందుకు, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం అడతీగల సాయి సన్నిధి ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు నూతన మాడ్యూల్ శిబిరం నిర్వహించనున్నట్లు న్యాయ సేవాధికార సంస్థ అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా గిరిజనుల హక్కుల పరిరక్షణ, మానవ--వన్యప్రాణి సంఘర్షణ బాధితులకు న్యాయ సహాయం, శిక్ష--2026 పథకాలపై అవగాహన కల్పించనున్నారు.
జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ --కమ్ -- ప్రిన్సిపల్ జిల్లా ు సెషన్స్ జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా ముఖ్య అతిథిగా హాజరవుతారు అని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వై. శ్రీలక్ష్మి, జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎస్. ప్రశాంత్ కుమార్, పోలవరం జిల్లా ఓఎస్డీ ఎం. జవాలి అల్ఫోన్స్ , రంపచోడవరం ఆర్డీఓ, ఇన్‌చార్జి డీఆర్ఓ కె. స్వాతి తదితరులు పాల్గొంటారని తెలిపారు.

## గుర్తేడులో పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై అఖిలపక్షంతో సమావేశం



**వై రామవరం/ గుర్తేడు,పెన్ పవర్,సెప్టెంబర్ 18:** గుర్తేడు మండలంలో పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు పై అఖిలపక్షం నాయకులతో సమావేశం నిర్వహించడం జరిగిందని ఎంపీడీవో కే బాపన్న దొర తెలిపారు.
మండలంలో 11 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడం జరిగిందని, వీటిలో కొన్ని స్టేషన్లను మార్పు చేయడం కోసం పార్టీల నుండి దరఖాస్తులు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ విషయంపై అధికారులు తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్, స్వర్ణ గ్రామం సిబ్బంది, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు అని తెలిపారు.

## గంగవరం మండలంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఎంఎస్ నూతన కమిటీలు



**గంగవరం, పెన్ పవర్ ,సెప్టెంబర్ 18:** గంగవరం మండలానికి సంబంధించి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్), మాదిగ స్టూడెంట్ పవర్ (ఎంఎస్‌పీ), మాదిగ మహిళా సమాఖ్య (ఎంఎంఎస్) నూతన కమిటీలను నియమించారు. ఉమ్మడి అల్లూరి జిల్లా ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఎంఎస్ ఇన్‌చార్జి మోర్త బుజ్జిబాబు మాదిగ ఆధ్వర్యంలో ఈ కమిటీల నియామక ప్రక్రియ నిర్వహించారు.
ఉమ్మడి అల్లూరి జిల్లా సీనియర్ నాయకులు వేమగిరి అర్జున్ మాదిగ, డోకు బుర్ర నాగేశ్వరరావు మాదిగ, బొడపాటి కామరాజు మాదిగ, అయినవిల్లి అనిల్ మాదిగల సమక్షంలో నూతన కమిటీలను ప్రకటించారు.

**ఎంఆర్‌పీఎస్ గంగవరం మండల కమిటీ:**
అధ్యక్షుడిగా అయినవిల్లి నానిబాబు మాదిగ, అధికార ప్రతినిధిగా పలివెల వీరబాబు మాదిగలను నియమించారు.

**ఎంఎస్‌పీ గంగవరం మండల కమిటీ:**
అధ్యక్షుడిగా మసురుపాము సామ్యూల్ మాదిగ, అధికార ప్రతినిధిగా చాపల సత్తిబాబు మాదిగలను నియమించారు.

**మాదిగ మహిళా సమాఖ్య (ఎంఎంఎస్) గంగవరం మండల కమిటీ:**
అధ్యక్షురాలిగా ముప్పిడి సరోజినీ మాదిగ, అధికార ప్రతినిధిగా వంగలపూడి అమ్ములమ్మ మాదిగలను నియమించారు.ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులకు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. మాదిగల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం ఐక్యంగా పనిచేయాలని వారు పిలుపునిచ్చారు.

## గంగవరంలో విస్తృతంగా వాహనల తనిఖీ



**రికార్డులను పరిశీలించిన పోలీసులు.. నిబంధనలు పాటించాలని సూచన**

**గంగవరం, పెన్ పవర్ సెప్టెంబర్ 18:** గంగవరంలోని వై జంక్షన్ వద్ద ఎస్సై ఎస్. వెంకయ్య ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. జాతీయ రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తున్న వాహనాలను నిలిపి, వాహనాల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు.
వాహనాల ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ తదితర రికార్డులను తనిఖీ చేసి నిబంధనలు పాటిస్తున్నారా లేదా అన్నది పరిశీలించారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ప్రయాణ సమయంలో అవసరమైన ధ్రువపత్రాలను తమ వెంట ఉంచుకోవాలని ఎస్సై వెంకయ్య సూచించారు.ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, వాహనాలను అతివేగంగా నడపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రహదారులపై నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలను పాటించాలని సూచించారు. ఆయన వెంట గంగవరం పోలీస్ సిబ్బంది ఉన్నారు

# ఆర్ట్స్ కళాశాలలో టంగుటూరి అవార్డుల ప్రధానోత్సవం

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 18:**స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో పిజి సెట్–2026లో 100 ర్యాంకులు లోపు, సియుసెట్–2026లో ఘనమైన మార్కులు సాధించిన విద్యార్థులకు టంగుటూరి ప్రకాశం పంతులు అవార్డ్స్ – 2026 ప్రదానోత్సవం కళాశాల ఆవరణలోని యాంఫీ థియేటర్ వద్ద శుక్ర వారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల పూర్వ విద్యార్థి, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ ఆనాటి టంగుటూరి ప్రకాశం పంతులు 47 ఎకరాల ఈ స్థలాన్ని కళాశాలకు దానం చేసారని కొనియాడారు. ఇక్కడ చదువు కున్న విద్యార్థులు అత్యున్నత స్థాయిల్లో ఉండటం గర్వకారణమన్నారు. వారిని ఆదర్శంగా తీసుకుని నేటి విద్యార్థులు విలువలతో కూడిన విద్యాభ్యాసంతో ఉన్నత స్థాయికి వెళ్లలని కళాశాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. విద్యార్థులకు అవార్డులతో పాటు క్రీడలు నిర్వహిస్తూ సేవలు అందిస్తున్నారని ముళ్ల మాధవ్ బృందాన్ని అభినందించారు. ఆర్ట్స్ కళాశాలను గోదావరి పుష్కరాల నాటికి అభివృద్ధి కి కృషి చేస్తామన్నారు. రూ.50 లక్షలతో రెండు షటిల్ కోర్డులు కావాలని కోరారని పూర్తయ్యేలా చేస్తానని భరోసా ఇచ్చారు. కళాశాల గ్రౌండ్‌ను లెవెలింగ్ చేసేందుకు 100 లారీల మట్టిని పంపించడానికి సిద్ధంగా ఉన్నానని వెల్లడించారు. అనంతరం ఎమ్మెల్యే గోరంట్లకు, గొర్రెల సురేష్‌కు, దాతలకు సత్కారం చేసారు.




ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్ కె, చింతపెంట ప్రభాకర్, ముళ్ల మాధవరావు, ఎన్‌జి శ్యామ్ సింగ్, జి.లీలామోహన్ రావు, ఎన్.విజయబాబు, ఎస్‌విఆర్ నరేష్, మాళవిక, జి.వెంకట రెడ్డి, గద్దె సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యం





- మర్రిపాలెంలో ఘనంగా పోషణ మాసోత్సవం
- ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి

**గంగవరం, పెన్ పవర్ సెప్టెంబర్ 18:** తొమ్మిదవ జాతీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా గంగవరం మండలం మర్రిపాలెం గ్రామంలో శుక్రవారం పోషణ మాసోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ గంగవరం ప్రాజెక్టు సీడీపీఓ వి. సుచరిత ఆదిలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి గంగవరం మండల పరిషత్ అధ్యక్షుడు పల్లాల కృష్ణారెడ్డి, తెలుగుదేశం పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు పల్లాల వెంకటరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి మాట్లాడుతూ చిన్నారులు ఆరోగ్యంగా ఎదగాలంటే చిన్నతనం నుంచే సమతుల్యమైన, పోషక విలువలు కలిగిన ఆహారం అందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. పోషకాహార లోపం వల్ల పిల్లల ఎదుగుదలపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున తల్లులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంట్లో అందుబాటులో ఉండే ఆకుకూరలు, కూరగాయలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, పండ్లు వంటి పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను రోజువారీ ఆహారంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. పిల్లల ఆరోగ్యం, పోషణపై తల్లిదండ్రులకు నిరంతరం అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.అనంతరం సీడీపీఓ సుచరిత ఆదిలక్ష్మి మాట్లాడుతూ పోషణ మాసోత్సవం సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల పరిధిలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, మహిళలకు పోషకాహారం, ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రక్తహీనత నివారణ, పోషకాహార లోపాన్ని అధిగమించడం, పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు.కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, మహిళలు, తల్లులు, చిన్నారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోషకాహార ప్రాధాన్యతను తెలియజేస్తూ వివిధ రకాల ఆహార పదార్థాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాలు రెడ్డి, కార్యదర్శి కృష్ణార్జున మహిళా పోలీస్ అనంతలక్ష్మి ఏఎన్ఎం సరోజినీ అంగన్వాడీ కార్యకర్తలు పి వెంకటరమణ జి వెంకయ్యమ్మ సిహెచ్ రామయ్యమ్మ భూలోకం నాగమణి తదితరులు పాల్గొన్నారు

## ప్రజాసేవ సంకల్ప అభియాన్ బిజెపి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమము



**వై రామవరం,పెన్ పవర్, సెప్టెంబర్ 18:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 25 ఏళ్ల ప్రజాసేవ సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బిజెపి పార్టీ ఆధ్వర్యంలో వై.రామవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో రోగులకు రొట్టె పాలు పండ్లు పంపిణీ చేయడం జరిగిందని రాష్ట్ర బిజెపి కార్యదర్శి ఈ.స్వప్న కుమారి తెలిపారు.

ప్రధాని నరేంద్ర మోడీ ప్రజాసేవ ప్రస్థానంలో భాగంగా మండలంలో బిజెపి ఆధ్వర్యంలో వై.రామవరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించడం జరిగిందని తెలిపారు. వారికి రొట్టె పాలు పండ్లు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బిజెపి రాష్ట్ర కార్యదర్శి ఈ.స్వప్న కుమారి మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రధానిగా దేశానికి, ప్రజలకు ఎనలేని సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఆయన సేవ స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్దేశంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమాజంలో అవసరమైన వారికి అండగా నిలవడం, సేవా భావాన్ని మరింత విస్తరించడం ప్రతి బిజెపి కార్యకర్త బాధ్యతని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు ముత్యాల ఆది విష్ణు, జనరల్ సెక్రెటరీ శ్రీను, సీనియర్ కార్యకర్త సూరిబాబు, పలువురు బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారని తెలిపారు.

## 20న రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**రంపచోడవరం, పెన్ పవర్ సెప్టెంబర్ 18**: రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ ఆదివారం సిరిగిందలపాడులో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయానందజీ మహారాజ్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ వైద్య శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు.శిబిరంలో సాధారణ వ్యాధులతో పాటు ఆయుర్వేదం, దంత, రక్తపోటు, మధుమేహం, చెవి, ముక్కు, గొంతు, ఎముకలు, కీళ్ల వ్యాధులు, మూర్ఛ, చర్మ వ్యాధులకు వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. అలాగే స్త్రీలు, పిల్లలకు సంబంధించిన అనారోగ్య సమస్యలకు కూడా వైద్యుల ద్వారా పరీక్షలు, సలహాలు అందించనున్నట్లు పేర్కొన్నారు.వైద్యుల సూచన మేరకు గుండె పరీక్ష, ఎక్స్‌రే, రక్త పరీక్షలు, భౌతిక చికిత్స తదితర సేవలను నిర్ణీత రుసుముతో అందించనున్నట్లు తెలిపారు. పరమపూజ్య యోగానంద నేత్రాలయ, వేగిరి వారిచే కంటి వైద్య సేవలు కూడా అందుబాటులో ఉంటాయని, అవసరమైన వారికి కంటి శస్త్రచికిత్సలు ఉచితంగా నిర్వహించడంతో పాటు కళ్లజోళ్లు అందజేయనున్నట్లు తెలిపారు.వైద్య శిబిరానికి వచ్చే వారు ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. గతంలో వైద్యం చేయించుకున్న వారు తమ పాత వైద్య చీటీలు, పరీక్షల నివేదికలను కూడా వెంట తీసుకురావాలని కోరారు.గిరిజన ప్రాంత ప్రజలు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయానందజీ మహారాజ్ విజ్ఞప్తి చేశారు.

## ప్రత్యేక మహిళా కారాగారం లో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శైలజ పరిశీలన



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 18:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ, డీఎస్పీ శివప్రియ, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీదేవి శుక్రవారం నగరం లోని ప్రత్యేక మహిళా కారాగారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీల వసతి, భద్రత, పరిశుభ్రత, ఆహారం, వైద్య సదుపా యాలు, తాగునీరు, సంక్షేమం తదితర మౌలిక వసతులను పరిశీలించారు.

కారాగారంలో సుమారు 130 మంది మహిళా ఖైదీలు, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఖైదీలకు మౌలిక వసతులతో పాటు వారి సమస్యలను అధికారులు, కౌన్సిలర్లు, సిబ్బంది దృష్టికి తీసుకువచ్చే అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు. ఖైదీలలో సానుకూల మార్పు తీసుకురావడానికి క్రమం తప్పకుండా కౌన్సెలింగ్, మార్గదర్శక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మహిళా కమిషన్ చైర్‌పర్సన్ తదితరులు కారాగారంలోని జనరల్ కిచెన్, ఆసుపత్రి, బేకరీ, ఖైదీల బ్యారక్స్, పిల్లల క్రెచ్, ఆర్.ఓ. ప్లాంట్లను పరిశీలించారు. ఖైదీల ఆహారాన్ని రుచి చూసి, అభినందించారు. ఆర్.ఓ. ప్లాంట్ ద్వారా స్వచ్ఛమైన తాగునీరు ను పరిశీలిం చారు. కారాగార ప్రాంగణంలోని పచ్చదనం, పరిశుభ్ర వాతావరణాన్ని ప్రశంసించారు.అనంతరం గిరిజన ఖైదీలు, ఇతర ఖైదీలతో ముఖాముఖి మాట్లాడి వారి కేసుల వివరాలు, కుటుంబ పరిస్థితులు, సదుపాయాల గురించి తెలుసుకున్నారు. ఎన్‌డీపీఎస్, హత్య కేసుల ఖైదీలతో మాట్లాడి వారికి కౌన్సెలింగ్ అందించారు. ఖైదీలు క్రమశిక్షణతో, ఆరోగ్యంగా, ఖైదీల శారీరక వ్యాయామం, వినోదం కోసం ఆట స్థల సదుపాయం అందుబా టులో ఉన్నట్లు పరిశీలించారు.ఈ కార్యక్రమంలో కారాగారం సూపరింటెం డెంట్ సి.హెచ్. వసంతకుమారి, ఇందిరా భారతి రాయ్, పి. పావని, కె. సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి జనతా వారధి లో ప్రజల సమస్యల పై వినతులు




**రాజమహేంద్రవరం, పెన్ పవర్ సెప్టెంబర్ 18:**భారతీయ జనతా పార్టీ తూర్పుగోదావరి జిల్లా కార్యాలయంలో జనతా వారధి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్, పశ్చిమ గోదావరి జిల్లా ఇన్‌చార్జ్ రేలంగి శ్రీదేవి పాల్గొని వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలు, వినతులను స్వీకరించారు. ప్రజలు తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను జనతా వారధి దృష్టికి తీసుకువచ్చారు. రోడ్ల సమస్యలు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం తదితర సమస్యలను వివరించారు. ప్రజలు తెలియజేసిన సమస్యలను సంబంధిత అధికారుల, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి త్వరగా పరిష్కారం అయ్యేలా చర్యలు చేపడతామని నాయకులు తెలిపారు. ప్రజల సమస్యలను పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి , ఎం ఎల్ సి సోము వీర్రాజు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు తమ సమస్యలను జనతా వారధి లో తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి, జనతా వారధి జోన్ ఇన్‌చార్జ్ బొమ్మల దత్తు, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి జనతా వారధి జిల్లా కన్వీనర్ ఎం.ఎస్.ఆర్.కె. రాజు, జిల్లా కార్యదర్శి జనతా వారధి జిల్లా కో–కన్వీనర్ స్వామి సూర్యకిరణ్, బండి ప్రసాద్, వై. మీనాక్షి, వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు

## వాయు కాలుష్యంపై అవగాహన వారోత్సవాలలో భాగస్వామ్యం కావాలి -కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 18:**స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకర రాజమహేంద్ర వరం" అనే సందేశంతో నగరపాలక సంస్థ ప్రతి ఏటా సెప్టెంబర్ చివరి వారంలో నిర్వహించు వాయు కాలుష్య అవగాహన వారోత్సవాలలో ప్రజలు భాగస్వామ్యం కావాలని కమిషనర్ రాహుల్ మీనా పిలుపునిచ్చారు. ఈ వారోత్సవాలలో భాగంగా అవగాహన ర్యాలీలు, పాఠశాలల్లో ప్రచార కార్యక్రమాలు, నగరం లో మొక్కల పెంపకం, పచ్చదనం , పర్యావరణ అనుకూల పద్ధతులపై వర్క్ షాప్ లు నిర్వహించడం జరుగుతుందన్నారు. వ్యర్థాల బహిరంగ దహనం, వ్యర్థాలను బహిరంగంగా పారవేయడం, నిర్మాణ కూల్చివేత వ్యర్థాలను పారవేయడం సింగిల్–యూజ్ ప్లాస్టిక్ వాడకంపై కఠినంగా వ్యవహరించడంతో పాటు ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నిర్దేశించిన నిబంధనలను ఉల్లంఘిస్తే జరిమానాతో పాటు ప్రభుత్వం చర్యలకు బాధ్యత వహించవలసి ఉంటుందన్నారు. స్వచ్ఛమైన గాలిని, ఆరోగ్యకరమైన రాజమహేంద్రవరాన్ని పరిరక్షించే కార్యక్రమాలలో పౌరులు తమ సహకారాన్ని అందించి, పాల్గొనవ లసిందిగా కోరారు.

# కూనవరంలో ఘనంగా జాతీయ పోషణ మాసం వేడుకలు...





### గర్భిణీలు,బాలింతలకు అవగాహన
### సీమంతాలు,పోషకాహార ప్రదర్శన

**కూనవరం,పెన్ పవర్,సెప్టెంబర్18.** పోలవరం జిల్లా సమగ్ర శిశు అభి వృద్ధి సేవల పథకం ఆధ్వర్యంలో 9వ జాతీయ పోషణ మాసం వేడు కలు కూనవరం మండలంలో ఘనం గా నిర్వహించారు.పల్లూరు అంగ న్వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్ర మంలో ప్రాజెక్టు అధికారిని మల్లిక పాల్గొన్నారు.పౌష్టిక ఆహారం వలన కలిగే లాభాలను సూపర్వైజర్ వన జాక్షి మాట్లాడుతూ మునగా కును నిత్యం ఆహారంలో వినియోగించ డం వల్ల విటమిన్లు,ఖనిజాలు,ఇను ము శాతం అధికంగా లభిస్తాయని, ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగు తుందని తెలిపారు.చిన్నారులు, గర్భిణులు,బాలింతలు,బాలికలకు ప్రతిరోజు పోషకాహారం అందించా లని సూచించారు.మాతృ వందన పథకం,గిరిజన గర్భిణులకు అందిం చే సేవలు,తల్లి–బిడ్డల సంరక్షణ, వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు.కొండారెడ్ల ఆవాసం టే కులోద్దిలో అంగన్వాడీ శాఖ ఆధ్వ ర్యంలో నిర్వహించినకా ర్యక్రమంలో గర్భిణీ స్త్రీలు,బాలింత మహిళలకు పోషకాహారం తీసుకోవాల్సిన అవ సరంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా గర్భిణీలకు సీమంత వేడుకలు నిర్వహించారు.పోషకా హార ప్రదర్శన ద్వారా వివిధ ఆహార పదార్థాల ప్రాముఖ్యతను వివరిం చారు.ఈ కార్యక్రమంలో అంగన్వా డీ కార్యకర్తలు కె చంద్రమ్మ,సీత మ్మ,ఆశ కార్యకర్తలు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

## ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి....
## మరో రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి గాయాలు





**గోకవరం పెన్ పవర్ సెప్టెంబర్ 18:-** కామరాజుపేట పంచాయతీ శివారు గంగవరం వెళ్లే రోడ్డులో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు శుక్రవారం సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో గోకవరం పంచాయతీ వీరలంకపల్లి జంక్షన్ వద్ద మరో రోడ్డు ప్రమాదంలో మరో వ్యక్తి తీవ్ర గాయాలు పాలయ్యారు దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి కాకినాడ జిల్లా జగ్గంపేట గ్రామానికి చెందిన వాసంశెట్టి ఆనంద్ కుమార్ ( 26 )ఒక వ్యక్తి నెల్లిపూడి వైపు నుండి కామరాజుపేట వైపు వస్తుండగా గోకవరం నుండి అడ్డతీగల వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడం తో ఆనంద్ కుమార్ అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు విషయం తెలుసుకున్న గోకవరం పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి ప్రమాద వివరాలు తెలుసుకొని కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోకవరం ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. ఇది ఎలా ఉండగా గోకవరం వైపు నుండి రాజమండ్రి వెళుతున్న జాతీయ రహదారిపై వీర్లంపల్లి సమీపంలో ఒక మరో రోడ్డు ప్రమాదం జరిగింది దీనిలో ఒక వ్యక్తి తీవ్ర గాయాలు అయినట్లు స్థానికులు 108 కి సమాచారం ఇవ్వడంతో గోకవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది దీనికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందిద

## ప్రధాని మోదీ ప్రారంభించిన సెమీకాన్ ఇండియా--2026 కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకించిన ఏపీ నిట్ ఆచార్యులు, విద్యార్థులు



**తాడేపల్లిగూడెం,పెన్ పవర్. సెప్టెంబర్18:** సెమీకండక్టర్ చిప్ తయారీకి ప్రపంచానికి కొత్త, విశ్వసనీయమైన ప్రదేశాలు అవసరమని, ఆ అవసరాన్ని తీర్చేందుకు భారత్ సిద్ధమవుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. న్యూఢిల్లీలో ఆయన ప్రారంభించిన సెమీకాన్ ఇండియా--2026 కార్యక్రమాన్ని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్) ఆచార్యులు, విద్యార్థులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించారు. ఏపీ నిట్ ఇంచార్జ్ డైరెక్టర్, ప్రొఫెసర్ ఎన్.వి.రమణారావు ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి, డీన్ ప్లానింగ్ అండ్ డెవలప్మెంట్ డాక్టర్ వి.సందీప్ సహకారంతో సంస్థ ప్రాంగణంలోని సెమినార్ హాలులో ప్రత్యేకంగా భారీ స్క్రీన్‌ను ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. సెమీకండక్టర్ రంగంలో భారత్ సాధిస్తున్న పురోగతి, భవిష్యత్ సాంకేతిక అవకాశాలపై ప్రధానమంత్రి ప్రసంగాన్ని ఆచార్యులు, విద్యార్థులు ఎంతో ఆసక్తిగా వీక్షించారు. ఏపీ నిట్‌లో జరిగిన కార్యక్రమాన్ని సి2ఎస్ ప్రాజెక్టు ప్రధాన పరిశోధకులు, ఆచార్యులు డాక్టర్ కిరణ్ కుమార్ గుర్రాల, సహ-ప్రధాన పరిశోధకులు, ఆచార్యులు డాక్టర్ పులి కిషోర్ కుమార్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెమీకాన్ ఇండియా--2026 ద్వారా భారతదేశంలో సెమీకండక్టర్ తయారీ, చిప్ డిజైన్, పరిశోధన, నైపుణ్యాభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. ముఖ్యంగా పరిశోధక విద్యార్థులకు సెమీ కండక్టర్ రంగంలో వస్తున్న నూతన అవకాశాలు, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహనను పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న సెమీకండక్టర్ రంగం, చిప్ డిజైన్, తయారీ, పరిశోధనతో పాటు భవిష్యత్ సాంకేతిక అవకాశాలపై సెమీకాన్ ఇండియా--2026 కార్యక్రమం ఆచార్యులు, విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించిందని చెప్పారు. తమకు రూ కోటి విలువ చేసే సి2ఎస్ ప్రాజెక్ట్ మంజూరుచేయటంతో పాటు, భారత ప్రభుత్వం ఇప్పటికే ఏపీ నిట్ విద్యా సంస్థకు ఎంతో విలువైన డిజైన్ సాఫ్ట్వేర్లు, వివిధ రకాల ఎఫ్.పి.జి.ఏ బోర్డులు, పరికరాలను, వియల్ఎస్ఐ చిప్ డిజైన్ కు తోడ్పడే పరికరాలను అందించిందని తెలిపారు. పరిశోధక విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకుని సెమీ కండక్టర్ తయారీ రంగానికి కావాల్సిన సాంకేతిక నైపుణ్యాలను, చిప్ డిజైన్ పై అవగాహనను పెంపొందించుకోవాలని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ రోమియో, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రం లో ఇచ్చే తాజా వేడి భోజనం అందించాలి

**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 18.** సెప్టెంబర్ 9 వ తేదీ నుంచి అక్టోబర్ 8వ తేది వరకు జరిగే జాతీయ పోషకాహార మాసొత్సవముల లో భాగం గా శుక్రవారం న తాడేపల్లిగూడెం మునిసిపాలిటీ పరిధిలోని 13వ వార్డ్ స్కూల్ లో ఈ కార్యక్రమం నిర్వహించరు. ఈ కార్యక్రమంలో ప్రథం జిల్లా కోర్డినేటర్ వెంకట్ హాజరై ప్రీ స్కూల్ కి వచ్చే 3 నుండి 6 సంవత్సరాల పిల్లలకు రోజువారీ మన అంగన్వాడీ కేంద్రం లో ఇచ్చే తాజా వేడి భోజనం గురించి తెలియజేసారు. అంగన్వాడీ టీచర్స్ చేత దానిని వారి ఎదురుగా వండి చూపించడమైంది. దానిలో వుండే పోషకాపదార్ధాలను గురించి వివరించి చెప్పడమైనది. అనగా మనం ప్రతి రోజు తీసుకునే ఆహారం లో పిండిపదార్ధాలు , క్రొవ్వుపదార్ధాలు, మాంసపుకృత్తులు, విటమిన్ లు, మినరల్స్ తప్పనిసరిగా ఉండవలెనని దానినే సమతులాహారం అంటారని అటువంటి సమతుల ఆహారాన్ని మన అంగన్వాడీ కేంద్రం లో ప్రతి రోజు ఇస్తామని తెలియజేయడమైనది. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ సి హెచ్ దుర్గ భవాని, స్కూల్ , అంగన్వాడీ మానిటరింగ్ కమిటీ సభ్యులు, అంగన్వాడీ వర్కర్స్ మరియు తల్లులు హాజరైనారు.



## పోలవరం జిల్లాలో ఘనంగా 'ఆశీర్వాద దీపం'





- 12 మండలాల్లో సామూహిక దీప ప్రజ్వలన..
- బూత్ స్థాయి వరకు ఇళ్లలో దీపాలు వెలిగింపు

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 18:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఆశీర్వాద దీపం' కార్యక్రమం పోలవరం జిల్లాలో ఘనంగా నిర్వహించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఈకా బుల్లికొండలుదొర తెలిపారు. సెప్టెంబర్ 17న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇంటింటా దీపాలు వెలిగించాలని బీజేపీ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈకా బుల్లికొండలుదొర తెలిపిన వివరాల ప్రకారం.. పోలవరం జిల్లాలోని 12 మండలాల్లో ప్రత్యేక ప్రాంతాల్లో సామూహికంగా దీప ప్రజ్వలన కార్యక్రమాలు నిర్వహించారు. బూత్ స్థాయి వరకు బీజేపీ కార్యకర్తలు, కూటమి నాయకులు, అభిమానులు, ప్రజలు తమ ఇళ్లలో దీపాలు వెలిగించి కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ప్రధాని నరేంద్ర మోదీకి శుభాకాంక్షలు, ఆశీస్సులు తెలియజేస్తూ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.

**సేవా కార్యక్రమాలకు విశేష స్పందన**

ప్రధాని జన్మదినం సందర్భంగా జిల్లాలోని తొమ్మిది ప్రాంతాల్లో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాల్లో బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారని బుల్లికొండలుదొర తెలిపారు. పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు గంగవరం, దేవీపట్నం తదితర ప్రాంతాల్లోని ఆసుపత్రుల్లో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. 'ఆశీర్వాద దీపం'తో పాటు సేవా కార్యక్రమాల్లో కూడా కార్యకర్తలు, కూటమి నాయకులు, అభిమానులు, ప్రజలు భాగస్వాములు కావడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమాలను విజయవంతం చేయడంలో భాగస్వాములైన బీజేపీ కార్యకర్తలు, కూటమి నాయకులు, అభిమానులు, ప్రజలందరికీ పోలవరం జిల్లా బీజేపీ తరపున ఈకా బుల్లికొండలుదొర కృతజ్ఞతలు తెలిపారు.

## అర్హతకు మించిన వైద్యంతో ఇద్దరు మృతి...







**-30 లక్షల పరిహారం ఇవ్వాలి**
**-కుంజ శ్రీను డిమాండ్**

**కూనవరం,పెన్ పవర్, సెప్టెంబర్18.** కూనవరం మండలంలో అర్హతకు మించి వైద్యం చేయడంతో ఇద్దరు ఆదివాసీలు మరణించారని ఆది వాసీ సంక్షేమ పరిషత్ ఆరోపించిం ది.ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను మాట్లాడుతూ చిన్నార్కూరుకు చెందిన తెల్లం శ్రీకాంత్ (31), బంధం లక్ష్మణ్ స్థానిక వైద్యుడి వద్ద చికిత్స తీసుకున్న అనంతరం మరణించా రని తెలిపారు.ఏజెన్సీలో కొందరు పరిధి దాటి వైద్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈఘటనపై విచారణ జరిపి బాధ్యులపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ,హత్య కేసు నమోదు చేయాలని,మృతుల కుటుంబాలకు చెరో 30లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఏజెన్సీలో అక్రమ క్లినిక్‌లపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఎన్ హెచ్ ఆర్ సి,ఎస్సీఎస్టీ లకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

## కోలాటాల నడుమ అంగరంగ వైభవంగా గణనాథుని శోభాయాత్ర



**గంగవరం, పెన్ పవర్ సెప్టెంబర్ 18:** గణపతి నవరాత్రులను పురస్కరించుకుని గంగవరం మండలం ఏటిపల్లిలో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహానికి శుక్రవారం ఘనంగా నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో పూజలు అందుకున్న గణనాథుని విగ్రహాన్ని గ్రామంలోని భక్తులు, యువత ఆధ్వర్యంలో శోభాయాత్రగా తరలించారు.ఏటిపల్లి నుంచి ప్రారంభమైన గణనాథుని ఊరేగింపు అడ్డపల్లి, గంగవరం గ్రామాల మీదుగా సాగింది. కోలాటాలు, భక్తుల నృత్యాలు, జై గణేశ్ నినాదాలతో శోభాయాత్ర సందడిగా సాగింది. గ్రామాల్లోని ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. అనంతరం జడేరు శివారులోని పెద్దేరు వాగు వద్దకు విగ్రహాన్ని తీసుకెళ్లి భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు.

**పోలీసుల పటిష్ట బందోబస్తు**

గణనాథుని శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గంగవరం ఎస్సై ఎస్. వెంకయ్య ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఊరేగింపు కొనసాగే మార్గంలో పోలీసు సిబ్బంది భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రశాంత వాతావరణంలో గణనాథుని నిమజ్జన కార్యక్రమం పూర్తవడంతో నిర్వాహకులు, భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.

## కార్యకర్తలే నా బలం.. ఎవరైనా బాధపడి ఉంటే క్షమించండి



**అడ్డతీగల సమావేశంలోని మాటలను పూర్తి సందర్భంలో చూడాలి**
**ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి**

**గంగవరం /రాజవొమ్మంగి, పెన్ పవర్ సెప్టెంబర్ 18:** అడ్డతీగలలో గతంలో జరిగిన సమావేశంలో తాను మాట్లాడిన మాటల్లోని కొన్ని భాగాలను మాత్రమే సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం వల్ల అసలు ఉద్దేశం వేరుగా అర్థమయ్యే పరిస్థితి ఏర్పడిందని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ మిరియాల శిరీషాదేవి తెలిపారు. శుక్రవారం రాజవొమ్మంగి లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.అడ్డతీగల సమావేశంలో తాను మాట్లాడిన పూర్తి విషయాన్ని కాకుండా కొన్ని మాటలను విడిగా తీసుకుని ప్రచారం చేశారని ఎమ్మెల్యే తెలిపారు. తాను ఏ పరిస్థితుల్లో మాట్లాడాల్సి వచ్చింది, ఏ సందర్భంలో ఆ మాటలు వచ్చాయి, వాటి వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటో పూర్తి వీడియోను పరిశీలిస్తే స్పష్టంగా అర్థమవుతుందని పేర్కొన్నారు.కార్యకర్తలతో మాట్లాడే సమయంలో తాను కొంత కఠినంగా మాట్లాడి ఉంటే, ఆ మాటల వల్ల ఎవరైనా బాధపడి ఉంటే మనస్ఫూర్తిగా క్షమించాలని ఆమె కోరారు. కార్యకర్తలను బాధపెట్టాలనే ఉద్దేశం తనకు ఎప్పుడూ లేదని స్పష్టం చేశారు."కార్యకర్తలు ఉంటేనే నేను ఉన్నాను. నా ఒక్కరి సంకల్పంతోనే నేను ఎమ్మెల్యే కాలేదు. కార్యకర్తల బలం, వారి నమ్మకం, వారి కష్టంతోనే ఈరోజు రంపచోడవరం నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ప్రజలకు సేవ చేసే అవకాశం నాకు వచ్చింది" అని శిరీషాదేవి అన్నారు.కుటుంబంలో ఏదైనా సమస్య తలెత్తినప్పుడు దాన్ని సరిచేయడానికి కొన్నిసార్లు కుటుంబ సభ్యులతో గట్టిగా మాట్లాడాల్సి వస్తుందని, అదే భావనతో ఆ సమయంలో కార్యకర్తలతో మాట్లాడానని ఆమె వివరించారు. కార్యకర్తలను కేవలం రాజకీయంగా తనతో కలిసి పనిచేసే వారిగా కాకుండా కుటుంబ సభ్యులుగానే భావిస్తానని తెలిపారు.తన మాటల్లో కఠినత కనిపించి ఉండొచ్చని, అయితే ఆ మాటలను పూర్తి సందర్భంలో పరిశీలిస్తే తాను చెప్పాలనుకున్న విషయం స్పష్టమవుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తన మాటల వల్ల ఏ కార్యకర్త మనసైనా నొచ్చి ఉంటే పెద్ద మనసుతో తనను క్షమించాలని మరోసారి కోరారు.కార్యకర్తల నమ్మకం, సహకారం తనకు ఎప్పటికీ ముఖ్యమని శిరీషాదేవి అన్నారు. గత సమావేశంలో జరిగిన విషయాన్ని కొన్ని మాటల ఆధారంగా కాకుండా పూర్తి వీడియో, పూర్తి సందర్భాన్ని పరిగణనలోకి తీసుకుని అర్థం చేసుకోవాలని ఆమె కోరారు.

# దేశవాళీ అంపైర్లకు బీసీసీఐ గుడ్ న్యూస్.. వేతనాల పెంపునకు ఏకగ్రీవ ఆమోదం

- దేశవాళీ అంపైర్లు, రిఫరీల వేతనాల సవరణకు బీసీసీఐ ఆమోదం
- ఐపీఎల్ పాలకమండలి సభ్యులుగా అరుణ్ సింగ్ ధూమల్, మజుందార్ ఏకగ్రీవ ఎన్నిక
- 2027లో ఐపీఎల్ 20వ ఎడిషన్, 2028లో బోర్డు శతాబ్ది ఉత్సవాలకు నిర్ణయం
- దివ్యాంగ క్రికెటర్లకు మద్దతు పెంచడంపై సమావేశంలో ప్రత్యేక చర్చ
- 2026-27 వార్షిక బడ్జెట్‌కు ఆమోదం తెలిపిన సర్వసభ్య సమావేశం




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) దేశవాళీ అంపైర్లు, మ్యాచ్ రిఫరీలకు సంబంధించి ఒక కీలకమైన, సానుకూల నిర్ణయం తీసుకుంది. వారి వేతనాల పెంపుతో పాటు, గ్రేడ్లను పునర్వర్గీకరించే ప్రతిపాదనకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. నేడు ముంబైలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో జరిగిన 95వ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. దేశవాళీ క్రికెట్ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ఈ చర్య ఎంతో ముఖ్యమైనదిగా భావిస్తున్నారు. ఈ సమావేశంలో ఐపీఎల్ పాలక మండలికి (జీసీ) ఇద్దరు సభ్యుల ఎన్నిక ప్రక్రియ కూడా పూర్తయింది. ఐపీఎల్ ఛైర్మన్‌గా మరోసారి కొనసాగేందుకు పోటీ పడిన అరుణ్ సింగ్ ధూమల్, ఇండియన్ క్రికెటర్స్ అసోసియేషన్ (ఐసీఏ) ప్రతినిధిగా ఎం. ఖైరుల్ జమాల్ మజుందార్ తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ రెండు స్థానాలకు మరెవరూ నామినేషన్లు దాఖలు చేయకపోవడంతో, బీసీసీఐ ఎన్నికల అధికారి ఏ.కే. జోటి వారి ఎన్నికను అధికారికంగా ధ్రువీకరించారు. దీనితో ఐపీఎల్ పరిపాలనలో స్థిరత్వం కొనసాగనుంది. సమావేశంలో పలు ఆర్థిక, పరిపాలనాపరమైన తీర్మానాలకు కూడా ఆమోదం లభించింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిటెడ్ ఖాతాలను, 2026-27 వార్షిక బడ్జెట్‌ను జనరల్ బాడీ ఆమోదించింది. రాబోయే ఆర్థిక సంవత్సరానికి ఆడిటర్లను కూడా నియమించింది. భవిష్యత్ ప్రణాళికలపై కూడా బోర్డు దృష్టి సారించింది. 2027లో జరగనున్న ఐపీఎల్ 20వ ఎడిషన్‌ను ఘనంగా నిర్వహించాలని, అలాగే 2028లో బీసీసీఐ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా జరపాలని తీర్మానించింది. శతాబ్ది వేడుకలు 2027 డిసెంబర్‌లో ప్రారంభమై 2028 అంతటా కొనసాగుతాయని బీసీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది.

వీటితో పాటు, లైంగిక వేధింపుల నిరోధక (గ్రూాం) పాలసీ కింద కొత్త అంతర్గత కమిటీని ఏర్పాటు చేశారు. వయో నిర్ధారణ విధానానికి కూడా నూతనంగా ఆమోదం తెలిపారు. దేశంలోని దివ్యాంగ క్రికెటర్లకు మద్దతును మరింత క్రమబద్ధీకరించడం, వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించడంపై కూడా రాష్ట్ర సంఘాలతో చర్చించారు. ఈ సమావేశంలో బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్, ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా, కార్యదర్శి దేవజిత్ సైకియా, సౌరభ్ తివారీ, జయదేవ్ షా, రోహన్ జైట్లీ, అభిషేక్ దాల్మియా వంటి కీలక వ్యక్తులు పాల్గొన్నారు. బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ (క్యాబ్) అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ, కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్ ప్రసాద్ కూడా హాజరయ్యారు. ఋ

# సెమీస్‌కు చేరిన ఇండియా.. ఆసిన్ గేమ్స్ 2026లో జపాన్ చిత్తు




**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియన్ గేమ్స్ 2026క్వార్టర్ ఫైనల్ లో ఇండియా సూపర్ డూపర్ పర్ఫామెన్స్ తో జపాన్ ను మట్టికరిపించింది. వాళ్ల దేశంలో వాళ్లనే చిత్తు చేయడం డిఫెండింగ్ చాంపియన్ ఇండియాకు థ్రిల్లింగ్ విక్టరీ. 2026 సెప్టెంబర్ 18న జరిగిన టీ20 మ్యాచ్ లో 19.5 ఓవర్లలో కేవలం 57 పరుగులు మాత్రమే చేసి ఢీలా పడిపోయింది జపాన్.

భారత మహిళల బౌలింగ్ కు జపాన్ పరుగులు తీయడానికి చాలా తీవ్రంగా శ్రమించినా లాభం లేకుండా పోయింది. చరణీ నాలుగు వికెట్లు తీసి జపాన్ బ్యాటర్లను ముప్పు తిప్పలు పెట్టింది. మరోవైపు షఫాలీ వర్మ రెండు వికెట్లు, దీప్తి శర్మ, శ్రేయాంక పాటిల్ చెరో వికెట్ తీయటంతో జపాన్ బ్యాటర్లు పరుగులు తీయలేకపోయారు. 57 రన్స్ చేసి 19.5 ఓవర్లలో ఆలౌట్ అయ్యారు. జపాన్ విధించిన స్వల్ప టార్గెట్ ను కేవలం 5 ఓవర్లలోనే ఊదేశారు హార్మన్ సేన. షఫాల్ వర్మ 15 బంతులలో 40 రన్స్ మెరుపు ఇన్నింగ్స్ తో సునాయాసంగా మ్యాచ్ గెలిచారు. 5వ ఓవర్లో షఫాలీ వరుసగా 4,4 సాధించగా, ఆ తర్వాత రిచా ఘోష్ ఫోర్ కొట్టి స్ట్రైక్ రొటేట్ చేసింది. దీంతో స్ట్రైక్ లోకి వచ్చిన షఫాలీ వర్మ.. సిక్స్ తో ఇన్సింగ్స్ పూర్తి చేసింది. దీంతో ఇండియా 8 వికెట్ల తేడాతో మ్యాచ్ గెలిచి ఆసియన్ గేమ్స్ 2026 సెమీస్ కు ఎంటరైంది ఇండియా.

# అతడు ఉండగా చింత ఎందుకు?.. శిఖర్ ధావన్‌తో బంధంపై రోహిత్ శర్మ




**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, తన ఓపెనింగ్ భాగస్వామి శిఖర్ ధావన్‌తో తనకున్న ఆత్మీయ అనుబంధాన్ని గుర్తుచేసుకున్నాడు. 'ఫ్యామిలీ ఫుల్ హౌస్ విత్ రోహిత్ శర్మ' అనే కార్యక్రమంలో పాల్గొన్న హిట్ మ్యాన్, ధావన్‌ను తన ప్రాణ స్నేహితుడిగా అభివర్ణించాడు. "నా ప్రాణస్నేహితుడు వస్తున్నాడు కాబట్టే ఈరోజు నేను ఇంత ఉత్సాహంగా కనిపిస్తున్నాను" అని రోహిత్ చమత్కరించాడు. ఈ సందర్భంగా నిజమైన స్నేహానికి రోహిత్ శర్మ ఒక చక్కని నిర్వచనం ఇచ్చాడు. "కేవలం మీమ్స్, రీల్స్ పంచుకోవడమే స్నేహం కాదు. డ్రెస్సింగ్ రూమ్ అనుభవాలను, గెలుపోటములను, క్లిష్ట పరిస్థితులను, మైదానంలో ఓపెనింగ్ బాధ్యతలను పంచుకోవడమే నిజమైన స్నేహం" అని ఆయన అన్నాడు. జూనియర్ స్థాయి నుంచే తామిద్దరం కలిసి పోటీ క్రికెట్ ఆడటంతో తమ మధ్య ఇంతటి బలమైన బంధం ఏర్పడిందని వివరించాడు.

ధావన్‌తో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించే సమయంలో తనపై ఎలాంటి ఒత్తిడి ఉండేది కాదని రోహిత్ తెలిపాడు. "శిఖర్‌తో ఆడుతున్నప్పుడు నాపై ఒత్తిడి తగ్గుతుందని ఎప్పుడూ భావించేవాడిని. ఎందుకంటే అతను ఆ ఒత్తిడిని తనపైకి తీసుకుని, నా వరకు రాకుండా చూసేవాడు. అందుకే నేను ఎప్పుడూ 'శిఖర్ ఉండగా చింత ఎందుకు' అని అనుకుంటాను" అని రోహిత్ పేర్కొన్నాడు. భారత క్రికెట్ చరిత్రలో అత్యంత విజయవంతమైన ఓపెనింగ్ జోడీలలో ఒకటిగా నిలిచిన వీరిద్దరి స్నేహం, క్రికెట్ ప్రయాణాన్ని ఈ ఎపిసోడ్ ఆవిష్కరించింది.



సాంప్రదాయక అందంతో ఆకట్టుకుంటున్న సీరత్ కపూర్

# ట్రెండ్ షిఫ్ట్: క్రూరత్వం నుంచి డివోషన్ వైపు!



గ్లామర్ రంగంలో ట్రెండ్ ఎంత వేగంగా మారుతుందో చెప్పడానికి నేటి సినిమా పరిశ్రమ సరళి చక్కటి ఉదాహరణగా నిలుస్తోంది. ఒకవైపు కిల్, యానిమల్ వంటి చిత్రాలు తెరపై హింసను, మునుపెన్నడూ లేని క్రూయాల్టీని ప్రదర్శించి బాక్సాఫీస్ వద్ద సంచలనాలు సృష్టించగా.. అడల్ట్ కంటెంట్ చిత్రాల జోరు కూడా బాలీవుడ్‌లో విపరీతంగా పెరిగింది. ఒకప్పుడు ఏదైనా బోల్డ్ పాయింట్ కోసం చాలా అరుదుగా వాడే -ఏ- సర్టిఫికేట్ ట్రెండ్.. ఇప్పుడు దర్శకనిర్మాతలకు ఒక గుడ్డి అనుకరణగా మారుతోంది. గతంలో -యానిమల్- సాధించిన భారీ విజయంతో మొదలైన ఈ ధోరణి ఇటీవల మీర్జాపూర్, ధురంధర్ ది రివెంజ్, కాక్‌టెయిల్ 2, అస్సీ వంటి పెద్ద సినిమాలకు పాకి నిర్మాతలు ఈ బాటలోనే నడిచేలా చేసిందని విశ్లేషణలు వచ్చాయి. ఈ ట్రెండ్‌లో భాగంగానే సెప్టెంబర్ 18న విడుదలైన -దైరా-, -వైబ్- సినిమాలు కూడా సెన్సార్ బోర్డు నుంచి -ఏ- సర్టిఫికేట్ సొంతం చేసుకుని అందరినీ ఆశ్చర్యపరిచాయి. ప్రముఖ దర్శకురాలు మేఘనా గుల్జార్ తెరకెక్కించిన ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ -దైరా- చిత్రం సెప్టెంబర్ 11నే సెన్సార్ పూర్తి చేసుకుని 2 గంటల 23 నిమిషాల నిడివితో ఏ సర్టిఫికేట్ దక్కించుకుంది. ఇందులో కరీనా కపూర్ ఖాన్ డీసీపీ అజూనీ కోహ్లీగా, పృథ్వీరాజ్ సుకుమారన్ డీసీపీ రామన్ కుమార్‌గా నటిస్తున్నారు. ఒక అమ్మాయి కిడ్నాప్, అఘాయిత్యం, హత్య నేపథ్యంలో సాగే ఈ కథలో జువెనైల్ చట్టాలు, ఎన్‌కౌంటర్ల చుట్టూ ఉన్న సున్నితమైన వివాదాలను చర్చించనున్నారు. ఇది నటి కరీనా కెరీర్‌లో ఏడో -ఏ- రేటెడ్ సినిమా కావడం మరో విశేషం.

అలాగే కునాల్ ఖేము దర్శకత్వంలో తెరకెక్కిన -వైబ్- చిత్రం కూడా 2 గంటల 25 నిమిషాల రన్‌టైమ్‌తో సెన్సార్‌ను పూర్తి చేసుకుని -ఏ- సర్టిఫికేట్ పొందడం గమనార్హం. ఇందులో ప్రీతి జింటా కీలక పాత్రలో నటిస్తుండగా.. మొదట ఇదొక ఫన్ ఎంటర్‌టైనర్‌గా ప్రచారం జరగడంతో చివరికి దీనికి అడల్ట్ సర్టిఫికేట్ రావడం ప్రేక్షకులకు షాకిచ్చింది. ఇలా రొమాంటిక్, క్రైమ్, వయొలెంట్ జోనర్లలో అడల్ట్ సినిమాలే సర్వవ్యాప్తంగా మారుతున్నాయని భావిస్తున్న తరుణంలో ఇండస్ట్రీలో మరో భారీ ఊహించని మార్పు చోటు చేసుకుంటోంది. కేవలం బోల్డ్ – వైలెంట్ సినిమాలకే కాకుండా డివోషనల్ చిత్రాలకు కూడా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారనే వాస్తవం క్రమంగా నిరూపణ అవుతోంది. ప్రస్తుతం గ్లామర్ – కమర్షియల్ రంగంలో డివోషనల్ సినిమాల హవా క్రమంగా పెరుగుతోంది. -హనుమాన్-, -మహావతార్ నరసింహా-, -హనుమాన్ అంశ్- వంటి చిత్రాల ఘన విజయం అందించిన స్ఫూర్తితో ఇప్పుడు వారణాసి, రామాయణం వంటి భారీ ప్రాజెక్ట్‌లతో పాటు పలువురు ఆధ్యాత్మిక గురువుల బయోపిక్‌లు, పౌరాణిక నేపథ్య చిత్రాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్నాయి. ఇవన్నీ కేవలం భక్తి భావానికి మాత్రమే పరిమితం కాకుండా.. ఆధునిక సాంకేతిక హంగులు, భారీ విజువల్ ఎఫెక్ట్స్ .. కమర్షియల్ హంగులను అద్దుకుని వస్తుండటంతో ప్రేక్షకులలో వీటిపై అంచనాలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. ఈ పరిణామాలు గ్లామర్ రంగంలో ప్రేక్షకుల అభిరుచులు ఏ స్థాయిలో మారుతున్నాయో స్పష్టం చేస్తున్నాయి. ఒకవైపు హింసాత్మక కథలు, అడల్ట్ కంటెంట్ సినిమాలతో బాక్సాఫీస్‌ను షాక్ ఇస్తున్న మేకర్స్.. మరోవైపు దేశవ్యాప్తంగా ఉన్న సాంస్కృతిక, ఆధ్యాత్మిక సెంటిమెంట్లను క్యాష్ చేసుకునేందుకు భారీ డివోషనల్ సినిమాల వైపు పరుగులు పెడుతున్నారు. మొత్తానికి కంటెంట్ ఏదైనా సరే ప్రేక్షకుల నాడిని పట్టుకుని.. కమర్షియల్ హంగులతో తెరకెక్కిస్తే అది ఏ జోనర్ అయినా సరే అఖండ విజయాలను సాధించగలదని నేటి ట్రెండ్ నిరూపిస్తోంది.



రాశీ ఖన్నా అప్రయత్నమైన ఆకర్షణను నిర్వచించింది

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965